ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
చిత్తూరు జిల్లా వార్తలు
శనివారం 15 మార్చి 2025







క్యాబేజి, క్యాలీఫ్లవర్ ధరలు పతనం

● సాగు ఖర్చులూ రాలేదంటున్న రైతాంగం

పలమనేరు, మార్చి14 (ఆంధ్రజ్యోతి) : మార్కెట్‌లో క్యాబేజి, క్యాలీఫ్లవర్ ధరల పతనంతో సాగు చేసిన రైతులు కుదేలయ్యారు. పలమనేరు, గంగవరం, బైరెడ్డిపల్లె, పెద్ద పంజాణి మండలాల్లో దాదాపు 300మంది రైతులు ఈ రెండు పంటను సాగుచేశారు.ఈ సీజన్‌లో మంచి ధరలు వస్తాయని ఆశపడి మిగిలిన పంటలతో పోలిస్తే పెట్టుబడి వ్యయం ఎక్కువైనా భరించారు.మూడు నెలలకు పూర్తయ్యే ఈ పంటలకు సాంప్రదాయ ఎరువులతో పాటు రసాయనిక ఎరువులను వినియోగించాల్సి వుంది. క్రిమిసంహారక మందులు కూడా అధికంగా వినియోగిస్తారు.ఇలా వేలాది రూపాయలు వెచ్చించి సాగు చేసిన రైతులంతా నేడు కూలీల ఖర్చులు కూడా రావడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మూడు నెలలుగా క్యాబేజి 35 కిలోల బస్తా రూ. 100 నుంచి 150 ధర పలకడం గగనంగా మారింది. క్యాలీఫ్లవర్ కూడా ఒక సంచి అంటే సుమారు 10 నుంచి 12 క్యాలీఫ్లవర్ల ధరకూడా రూ. 140కి మించడం లేదు. చెన్నై మార్కెట్‌లో ధరలు లేకపోవడం ఇందుకు కారణమని ఇక్కడి వ్యాపారులంటున్నారు.క్యాబేజి, క్యాలీఫ్లవర్ పంటలను ఒకేసారి విస్తారంగా సాగు చేయడం కూడా మార్కెట్‌లో ధరల పతనానికి కారణమైందని కూడా చెబుతున్నారు.గత సంవత్సరం వర్షాలు అంతంత మాత్రంగానే కురవడంతో మండలానికి రెండు మూడు చెరువుల్లో మాత్రమే నీరు చేరింది.బోర్లలో కూడా నీరు అంతంతమాత్రంగానే వస్తున్నందున రైతులు కూరగాయల సాగుపై ఆసక్తి చూపుతున్నారు. డ్రిప్ పద్ధతిలో కూరగాయల సాగు చేస్తున్నందున పరిమిత నీటితో సాగు సాధ్యమవుతోంది. అయితే ఈ పంటలకు సైతం రైతులు టమోటా పంటలకు వినియోగించే మల్చింగ్ పేపరును, పెద్దఎత్తున క్రిమిసంహారక మందులను వినియోగించాల్సి వస్తోంది. గత మూడు నెలలుగా టమోటా ధరలు అథమస్థాయికి పడిపోవడంతో క్యాబేజి, క్యాలీఫ్లవర్ పంటల సాగుతో అయినా ఆర్థికంగా నిలదొక్కుకోవచ్చని భావించిన రైతులకు నిరాశే మిగిలింది. కనీసం సాగు ఖర్చులు కూడా రాలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ఎకరా సాగు చేసిన రైతులు సగటున రూ. 40నుంచి 50 వేల మేరకు నష్టపోయామంటున్నారు. ఉద్యానశాఖ అధికారులు సాగు విస్తీర్ణాన్ని ముందుగానే అంచనా వేసి దానికి తగిన విధంగా పంటలను మార్చి సాగు చేసేలా రైతులకు సూచించి వుంటే ఈ విధంగా నష్టపోయేవారు కాదని పలువురు అభిప్రాయపడుతున్నారు.

గరుడ వాహనంపై వరదుడి విహారం



● ఆలయ ప్రాంగణంలో భక్తిశ్రద్ధలతో సత్యనారాయణ స్వామి వ్రతం

ఐరాల(కాణిపాకం), మార్చి 14 (ఆంధ్రజ్యోతి): కాణిపాక వరసిద్ధి వినాయకస్వామి ఆలయానికి అనుబంధంగా ఉన్న వరదరాజస్వామి దేవాలయంలో శుక్రవారం రాత్రి గరుడ వాహనసేవ వైభవంగా జరిగింది. ఉదయం మూల విరాట్‌కు అభిషేకం చేసి, భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో సత్యనారాయణ స్వామి చిత్రపటాన్ని ఉంచి భక్తుల చేత సత్యనారాయణ వ్రతాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహింపజేశారు. రాత్రి శ్రీదేవి, భూదేవి సమేత వరదరాజస్వామి ఉత్సవర్లను గరుడ వాహనంపై ఉంచి కాణిపాకం పురవీధుల్లో ఊరేగించారు. స్వామిని దర్శించుకోవడానికి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ఈ కార్యక్రమంలో ఈవో పెంచలకిషోర్, ఏఈవో రవీంద్రబాబు, సూపరింటెండెంట్లు వాసు, కోదండపాణి తదితరులు పాల్గొన్నారు.



గరుడ వాహనంపై శ్రీదేవి, భూదేవి సమేత వరదరాజస్వామి - సత్యనారాయణ వ్రతం నిర్వహిస్తున్న భక్తులు

4,987 కిలోల రేషన్ బియ్యం స్వాధీనం

● ఒకరిపై కేసు నమోదు

చిత్తూరు రూరల్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు నగరంలోని మురకంబట్టు ఇందిరమ్మకాలనీలో అక్రమంగా నిల్వ ఉంచిన 4,987 కిలోల రేషన్ బియ్యాన్ని రెవెన్యూ అధికారులు శుక్రవారం స్వాధీనం చేసుకున్నారు. ఒకరిపై కేసు నమోదు చేశారు. ఆర్ఐ దినేష్ తెలిపిన వివరాల మేరకు.. మురకంబట్టు వద్ద ఉన్న ఇందిరమ్మకాలనీలో మూస అనే వ్యక్తి ఇంట్లో రేషన్ బియ్యం నిల్వ ఉందని చిత్తూరు అర్బన్ తహసీల్దార్ చంద్రశేఖర్‌రెడ్డికి సమాచారం వచ్చింది. దీంతో తాలూకా పోలీసులు, రెవెన్యూ సిబ్బంది కలిసి శుక్రవారం ఉదయం ఆ ఇంటి వద్దకెళ్లారు. ఇంటికి తాళం వేసి ఉంది. మూసకు ఫోన్ చేసినా.. తీయకపోవడంతో తహసీల్దార్ ఆదేశాలతో తాళం పగలగొట్టి లోపలకెళ్లారు. ఆ ఇంట్లో రేషన్ బియ్యం బస్తాలు కనిపించాయి. తూకం వేయగా 4,987 కిలోలు ఉన్నట్లు గుర్తించారు. ప్రభుత్వ లెక్కల ప్రకారం బియ్యం విలువ సుమారు రూ.1.24 లక్షలని రెవెన్యూ సిబ్బంది తెలిపారు. బియ్యం స్వాధీనం చేసుకుని.. మూసపై కేసు నమోదు చేసినట్లు తాలుకా ఎస్ఐ మల్లికార్జున తెలిపారు. రెవెన్యూ అధికారులు భార్గవ్, ప్రియాంక తదితరులు పాల్గొన్నారు.



మూస ఇంట్లో నిల్వ ఉన్న రేషన్ బియ్యం

నేడు 'స్వర్ణాంధ్ర- స్వచ్ఛ ఆంధ్ర'

చిత్తూరు సెంట్రల్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతి నెలా మూడో శనివారాన్ని 'స్వర్ణాంధ్ర- స్వచ్ఛ ఆంధ్ర' దినోత్సవంగా ప్రకటించిందని.. జిల్లావ్యాప్తంగా పారిశుధ్యం, పరిశుభ్రత పెంపొందించడానికి అందరూ కృషి చేయాలని కలెక్టర్ సుమిత్ కుమార్ కోరారు. శుక్రవారం టెలీకాన్ఫరెన్స్ ద్వారా ఆర్డీవోలు, మున్సిపల్ కమిషనర్లకు, తహసీల్దార్లు, ఎంపీడీవోలకు దిశా నిర్దేశం చేశారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధం, పునర్వినియోగ వస్తువుల ప్రోత్సాహకం అంశంగా కార్యక్రమాలు చేపట్టాలన్నారు. పట్టణాలు, గ్రామాలు, పారిశ్రామిక, వాణిజ్య ప్రాంతాలు, ఆస్పత్రులు, విద్యాసంస్థలు, సంక్షేమ హాస్టళ్లు, అంగన్వాడీలు, మార్కెట్లు, రైలు, బస్‌స్టేషన్లు, ప్రభుత్వ కార్యాలయాలు, పర్యాటక, ఆధ్యాత్మిక కేంద్రాల్లో ర్యాలీలు, అవగాహన సదస్సులు నిర్వహించాలన్నారు. ప్రతి శాఖలోని స్వచ్ఛతా కార్యక్రమాల వివరాలను స్వర్ణాంధ్ర- స్వచ్ఛ ఆంధ్ర యాప్‌లో తప్పనిసరిగా అప్‌లోడ్ చేయాలని ఆదేశించారు.

నేటినుంచి ఒంటిపూట బడులు

చిత్తూరు సెంట్రల్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): జిల్లావ్యాప్తంగా శనివారం నుంచి ఒంటిపూట బడులు నిర్వహించాలని విద్యాశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఎండల తీవ్రత దృష్ట్యా ఏప్రిల్ 23వ తేదీ వరకు ఉదయం 7.45 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకే బడులు నిర్వహించనున్నారు. అయితే టెన్త్ పరీక్షలు జరుగుతున్న 118 పాఠశాలల్లో మాత్రం మధ్యాహ్నం 1.15 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పాఠశాలలు పనిచేయనున్నాయి. ఇక గ్రామ పంచాయతీ, ఆర్‌డబ్ల్యూఎస్ సహకారంతో ప్రతి పాఠశాలలోనూ తాగునీటి వసతి, వైద్య ఆరోగ్య శాఖ సహకారంతో ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని ఆ ఉత్తర్వుల్లో పేర్కొంది. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా డీవైఈవోలు, ఎంఈవోలు, పాఠశాల హెచ్ఎంలు తగిన ఏర్పాట్లు చేయాలని కడప ఆర్జేడీ శామ్యూల్ సూచించారు.



సిద్ధేశ్వరస్వామి ఊరేగింపు



పెద్ద దేవరకు హాజరైన భక్తజనం



ఊరేగింపులో ఉత్సవమూర్తి

హరహర మహాదేవ్..!

భక్తుల తలలపై పగులుతున్న కొబ్బరి కాయలు. భక్తిపారవశ్యంతో ఊగిపోయే జనాలు.హరహర మహదేవ్.. దేవరా.. అంటూ మిన్నంటే భక్తిపూర్వక నినాదాలు. అక్షరాలా మినీ కుంభమేళాను తలపించేలా ఇసుక వేస్తే రాలనంత జనం.ఇది తొమ్మిదేళ్ల తరువాత సిద్ధేశ్వరస్వామిని కొలుస్తూ కురబ కులస్తులు జరుపుకున్న పెద్ద దేవర సంబరం.

● కురబ జాతరకు వెల్లువెత్తిన జనం ● సిద్ధేశ్వరస్వామికి బ్రహ్మోత్సవ వేడుక
●తలలపై కొబ్బరి కాయలు కొట్టుకుని మొక్కులు చెల్లించిన భక్తులు

కుప్పం/శాంతిపురం, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): శాంతిపురం మండలం కొలమడుగు పంచాయతీ కదిరి ముత్తనపల్లెలోని సిద్ధేశ్వరస్వామి ఆలయంలో ప్రధాన దైవం మొండికాళు సిద్ధేశ్వరస్వామే అయినా, ఆయనతో పాటు భగేశ్వరస్వామి, బత్తేశ్వరస్వామి, రేవణ సిద్ధేశ్వర స్వామి, చెన్నకేశవస్వామి కూడా పూజలందుకుంటున్నారు. కురబ కులస్తుల గోత్ర దైవాలైన వీరికి 9 ఏళ్లకు ఒకసారి వచ్చే పెద్ద దేవర ఉత్సవం శుక్రవారం అంగరంగ వైభవంగా జరిగింది. పంచ శైవ మూర్తుల మూల విగ్రహాలకు అభిషేకాలు నిర్వహించి, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం స్వామివారి ఉత్సవమూర్తిని ఊరేగింపుగా ఆలయం వెలుపలికి తీసుకు వచ్చారు.అప్పటికే మోకాళ్లపై వరుసల్లో కూర్చున్న భక్తులు తలలపై కొబ్బరి కాయలు కొట్టుకుని మొక్కులు తీర్చుకోవడానికి సిద్ధమయ్యారు. ఈ వేడుకను చూడడానికి తరలివచ్చిన భక్తజనంతో ఆలయ పరిసరాలు కిటకిటలాడాయి. భక్తుల తలలపై కొబ్బరికాయలు ఫట్ ఫట్ మంటూ పగిలాయి.ఒక్కో కొబ్బరికాయా పగులుతుంటే భక్తులు చేస్తున్న స్వామివారి నామ స్మరణలతో పరిసరాలు మార్మోగాయి. ఆంధ్రా, కర్ణాటక, తమిళనాడు ప్రాంతాలనుంచి ట్రాక్టర్లు, ఇతర వాహనాలలో కురబ కులస్తులు కుటుంబాలతో ఈ వేడుకకు తరలివచ్చారు. ఇతర కులస్తులు కూడా వీరికి తోడయ్యారు. దైవం కురబ గోత్ర దైవమే అయినా, పెద్ద దేవర వారి సంబరమే అయినా, కుల రహితంగా ఈ జాతరలో లక్షలాది మంది భక్తజనం పాల్గొన్నారు. పెద్ద దేవర జరిగిన కదిరముత్తనపల్లె ఒక్కటే కాదు, చుట్టూ అయిదు కిలోమీటర్ల మేర పరిసరాలు జన సందోహంతో కిటకిటలాడాయి.



భక్తుల తలలపై పగులుతున్న కొబ్బరికాయలు

సిద్ధేశ్వరస్వామి సేవలో సీఎం సతీమణి



సిద్ధేశ్వరస్వామి ఆలయంలో ఆశీర్వాదాలు అందుకుంటున్న నారా భువనేశ్వరి

ముఖ్యమంత్రి చంద్రబాబు సతీమణి నారా భువనేశ్వరి పెద్ద దేవరకోసమే హైదరాబాదు నుంచి వచ్చారు. శుక్రవారం మధ్యాహ్నం 2.30 గంటల ప్రాంతంలో కదిరిముత్తనపల్లెకు చేరుకున్న ఆమె ఆలయం వద్దకు వెళ్లి, స్వామివారికి సారె సమర్పించారు.దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. అనంతరం ఆలయం నుంచి బయటకు వచ్చి, భక్తులకు అభివాదం చేశారు.ఓపెన్ టాప్‌పై ఎక్కి మాట్లాడారు. మూడు రాష్ట్రాలనుంచి లక్షలాదిగా కురబ కులస్తులు తరలివచ్చి సిద్ధేశ్వరస్వామిని కొలుచుకోవడం, అది కూడా తొమ్మిదేళ్లకోసారి పెద్ద దేవర రావడం అబ్బురంగా వుందన్నారు. ఈ జాతరలో భక్తుల సౌకర్యాలకోసం రాష్ట్ర ప్రభుత్వం తరఫున ముఖ్యమంత్రి చంద్రబాబు రూ.80 లక్షలు ఇచ్చారని చెప్పారు.సాయంత్రం 3.45 గంటల ప్రాంతంలో భువనేశ్వరి బెంగళూరు బయలుదేరి వెళ్లారు. ఆమె వెంట ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్,ఆర్టీసీ వైస్ ఛైర్మన్ పీఎస్ మునిరత్నం తదితరులున్నారు.

అమెరికాలో కాల్పులు గాయపడ్డ గోవిందపురం యువకుడు

శ్రీకాళహస్తి, మార్చి 14(ఆంధ్రజ్యోతి): అమెరికాలో ఓ కారుపై దుండగులు జరిపిన కాల్పుల్లో ఏర్పేడు మండం గోవిందపురం పంచాయతీకి చెందిన పోతగుంట మోహన్‌సాయి గాయపడ్డారు. ఇతడు అమెరికాలోని మెమ్ఫిస్ ప్రాంతంలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నారు. భారత కాలమాన ప్రకారం గురువారం రాత్రి 11.30గంటల సమయంలో ఓ స్నేహితుడితో కలిసి కారులో ప్రయాణిస్తుండగా.. ఓ దుండగుడు వీరి కారుపై తుపాకీతో కాల్పులు జరిపాడు. దీంతో మోహన్‌సాయి కుడి భుజం, చేతిపై బుల్లెట్లు దిగడంతో తీవ్రంగా గాయపడ్డారు. ప్రాణాపాయ స్థితిలో మోహన్ తానే కారు నడుపుకుంటూ వాలేరోకు చేరుకుని అత్యవసర సాయం కోసం టోల్‌ఫ్రీ నెంబరుకు ఫోన్ చేశారు. స్థానిక అధికారులు మోహన్‌ను ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం మోహన్‌సాయి తీవ్రగాయాలతో చికిత్స పొందుతున్నారు. ఈ ఘటనపై సమాచారం అందుకున్న శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి ఫోన్‌లో మోహన్‌సాయి కుటుంబాన్ని పరామర్శించి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఆర్థికసాయం అందించడంతో పాటు ప్రభుత్వపరంగా సహాయకర చర్యలు అందజేస్తామని వారికి ధైర్యంచెప్పారు. అమెరికాలోని ఎన్నారైల ద్వారా మెరుగైన వైద్యసేవలు అందించేందుకు సాయం చేస్తానని కుటుంబ సభ్యులకు తెలిపారు.



చికిత్స పొందుతున్న మోహన్‌సాయి

రంజాన్ వేళలు
ఇఫ్తార్ (శనివారం) : 6.29
సహరి (ఆదివారం) : 5.00

చంద్రగిరి పంచాయతీ ఈవో సస్పెన్షన్

చంద్రగిరి, మార్చి 14(ఆంధ్రజ్యోతి): చంద్రగిరి పంచాయతీ ఈవో మహేశ్వరయ్యను సస్పెండ్ చేస్తూ రాష్ట్ర పంచాయతీరాజ్‌శాఖ కమిషనర్ వీఆర్ కృష్ణతేజ ఉత్తర్వులు జారీ చేసారు. గతవారం చంద్రగిరి ఈవో మహేశ్వరయ్య ఓ కాంట్రాక్టర్ వద్ద రూ.50 వేలు లంచం తీసుకొంటూ ఏసీబీ అధికారులకు పట్టుబడిన విషయం తెలిసిందే. అయన్ను అరెస్ట్ చేసి, నెల్లూరులోని ఏసీబీ కోర్టుకు తరలించగా న్యాయమూర్తి రిమాండ్ విధించారు. ఈ క్రమంలో మహేశ్వరయ్యను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి.

పశువుల దాణానూ వదల్లేదు

● దొంగతనం చేసిన కాణిపాక ఆలయ గోశాల ఏజెన్సీ ఉద్యోగి
● విధుల నుంచి తొలగించామన్న ఈవో

ఐరాల(కాణిపాకం), మార్చి 14 (ఆంధ్రజ్యోతి): కాణిపాక ఆలయ గోశాలలో పనిచేస్తున్న ఓ ఏజెన్సీ ఉద్యోగి పశువుల దాణా మూటను దొంగతనం చేశాడు. శుక్రవారం తన ఇంటికి మూటను తీసుకెళుతుండగా స్థానికులు గుర్తించి నిలదీశారు. దీనిపై ఆలయ ఈవో పెంచలకిషోర్‌కు ఫిర్యాదు చేశారు. ఆయన గోశాలలోని సీసీ కెమెరాలను పరిశీలించగా దాణా మూట చోరీ విషయం రుజువైంది. దీంతో ఆ ఉద్యోగిని విధుల నుంచి తొలగించామని తెలిపారు. క్రిమినల్ కేసు కూడా పెట్టామన్నారు.

పచ్చిగడ్డినే పెడుతున్నారు

గోశాలలో 180 పశువులున్నాయి. వీటి పోషణకు మూగజీవాల ప్రేమికులు తరచూ ఎండు, పచ్చిగడ్డిని టన్నుల కొద్దీ వితరణ చేస్తున్నారు. అయితే ఇక్కడి పశువులకు ఎక్కువగా పచ్చిగడ్డినే పెడుతున్నారన్న విమర్శలున్నాయి. అది కూడా ముక్కలుగా కత్తిరించకుండా వేస్తున్నారు. ఎందుకంటే గడ్డిని కత్తిరించే యంత్రాన్ని సైతం ఏజెన్సీ ఉద్యోగి విడిభాగాలుగా చేసి అమ్మేసినట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇకనైనా ఎండుగడ్డిని కూడా పెట్టాలని కోరుతున్నారు. అలాగే పశువులను గోశాలలో అలాగే ఉంచేయకుండా.. రెండు వందల మీటర్ల దూరమైనా తిప్పితే మరింత ఆరోగ్యంగా ఉంటాయని చెబుతున్నారు.

ఎర్రచందనం రక్షణపై నిపుణుల కమిటీ సమావేశం

మంగళం, మార్చి14(ఆంధ్రజ్యోతి): శేషాచలంలోని ఎర్రచందనం సంరక్షణపై ఎన్‌బీఏ, ఏపీఎస్‌బీబీ సంయుక్త ఆధ్వర్యంలో జాతీయ నిపుణుల కమిటీ శుక్రవారం తిరుపతిలో సమావేశమైంది. ఎర్రచందనం వృక్ష సంపదను పెంపొందించడం, ఎర్రచందనాన్ని గ్లోబల్ టెండర్ల ద్వారా విక్రయించి రాష్ట్ర ప్రభుత్వానికి ఆదాయం తెచ్చి పెట్టే అంశాలపై చర్చించారు. అక్రమ రవాణాన్ని అరికట్టడానికి అనుసరించాల్సిన విధానాలు, శేషాచలం అటవీ ప్రాంతంలో జీవ వైవిధ్యాన్ని కాపాడుకోవాల్సిన ఆవశ్యకతపై సమీక్షించారు. జంగిల్ సఫారీ, పర్యాటక అభివృద్ధి వంటి విషయాలపై రాష్ట్రస్థాయి అటవీశాఖ అధికారులతో చర్చించినట్లు తెలిసింది. బయో డైవర్సిటీ అథారిటీ ఛైర్మన్ అచలేందర్ రెడ్డి, బయో డైవర్సిటీ బోర్డు రాష్ట్ర ఛైర్మన్ నీలాయపాలెం విజయకుమార్, కార్యదర్శి రామకృష్ణ, తిరుపతి సీసీఎఫ్ సెల్వం, బయోట్రిమ్ స్టేట్ సిల్వికల్చరిస్ట్ నరేంద్రన్, జిల్లా అటవీశాఖాధికారి వివేక్, డివిజనల్ ఫారెస్ట్ అధికారులు, క్షేత్రస్థాయి అటవీశాఖ అధికారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



తిరుమలతో సంయుక్తా మీనన్

హీరోయిన్ సంయుక్తా మీనన్ శుక్రవారం ఉదయం వీఐపీ బ్రేక్‌లో తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. అనంతరం ఆలయం ముందు మీడియాతో మాట్లాడుతూ, ప్రస్తుతం రెండుమూడు సినిమాల్లో నటిస్తున్నట్టు తెలిపారు. సెప్టెంబరులో 'అఖండ 2' విడుదల కానుందన్నారు. 'స్వయంభూ' కూడా విడుదలకు సిద్ధంగా ఉందన్నారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి



సన్నటి పామే కానీ డేంజర్!

చాకచక్యంగా పట్టుకున్న భాస్కర్‌నాయుడు

పాము సన్నటిదే కానీ అత్యంత విషపూరితం. శుక్రవారం నాడు తిరుమల బాలాజీ నగర్‌లో ఒక బైక్‌లోకి ఎక్కేసింది. గమనించిన స్థానికులు భాస్కర్‌నాయుడుకు సమాచారం ఇచ్చారు. ఐదు అడుగులు పొడవున్న తాటికట్ల పామును ఆయన పట్టుకున్నారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

తిరుమలలో సుప్రీంకోర్టు న్యాయమూర్తి ఎస్వీఎన్ భట్టి



శ్రీవారి ఆలయం ముందు జస్టిస్ ఎస్వీఎన్ భట్టి, జస్టిస్ లక్ష్మణ్‌రావు

సుప్రీం కోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎస్వీఎన్ భట్టి శుక్రవారం ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ లక్ష్మణ్‌రావు కూడా ఆయన వెంట ఉన్నారు. అలాగే తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వేణుగోపాల్, మణిపూర్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి కృష్ణకుమార్ కూడా వేరువేరుగా శ్రీవారిని దర్శించుకున్నారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

నేడు స్లీపింగ్ డే



రాత్రంగా నిద్ర లేదు..మంచం మీద అటూ ఇటూ దొర్లుతూనే ఉన్నాను.. తెల్లవారుజామున రెండు గంటలు నిద్రపోయానంతే..

..కంటి నిండా నిద్రపోయి చాన్నాళ్లయింది .. ఏమయ్యిందో ఏంటో..

ఈమధ్య మాత్ర వేసుకున్నా నిద్ర పట్టడం లేదు. .

ఇలాంటి మాటలు చాలామంది నుంచి తరచూ వింటుంటాం. ఇటీవల కాలంలో నిద్రలేమితో బాధపడుతున్నవారి సంఖ్య ఎక్కువైంది. వయసుతో సంబంధం లేకుండా 80 శాతం మంది అనారోగ్య సమస్యలకు కారణం సరైన నిద్ర లేకపోవడమేనంటున్నారు వైద్యనిపుణులు. సగటున రోజుకు ఏడు గంటల సేపు నిద్ర పోకున్నా, సక్రమంగా నిద్ర పట్టడం లేదన్నా అనారోగ్య సమస్యలకు దగ్గరవుతున్నారని సంకేతమంటున్నారు.

- తిరుపతి(వైద్యం), ఆంధ్రజ్యోతి



కునుకే బంగారమాయెనె..

- పెరుగుతున్న నిద్రలేమి బాధితులు
- ఒత్తిళ్లు, నిరంతర ఆలోచనలతో సతమతం
- అదేపనిగా మొబైల్ ఫోన్ చూడటమూ కారణమే
- నిద్ర దూరమైతే అనారోగ్యం దగ్గరవుతున్నట్టే

ప్రస్తుత రోజుల్లో చాలామంది నిద్రలేమితో బాధపడుతున్నారు. వివిధ సమస్యలతో ఒత్తిళ్లు ఎదుర్కొంటున్న చాలామంది కంటి నిండా కునుకు తీయలేకపోతున్నారు. మంచం ఎక్కినా నిరంతర ఆలోచనలతో నిద్రకు దూరమవుతున్నారు. ఈతరహా బాధితులు పెరుగుతున్నారని మానసిక వైద్య నిపుణులు చెబుతున్నారు. తమ వద్దకు వస్తున్న రోగుల్లో వీరి సంఖ్య పెరుగుతోందంటున్నారు. దీనికితోడు అన్ని వర్గాల వారూ మొబైల్ ఫోన్లలో మునిగి తేలుతున్నారు. క్షణం ఖాళీ దొరికినా సెల్ చూస్తున్నారు. రాత్రివేళ కూడా దీంతోనే కాలక్షేపంతో చేస్తున్నారు. పగటి పూట కొంత పర్వా లేదు గాని రాత్రిళ్లు దీని ప్రభావ తీవ్రత ఎక్కువగా ఉంటుందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. నిద్రపోయే ముందు కళ్లు తీవ్ర ఒత్తిడికి గురైతే సక్రమంగా నిద్ర పట్టదు. చీకట్లో సెల్‌ఫోను చూడటం వల్ల ఆ ప్రభావం మూడింతలవుతోంది. దీంతో కళ్ల కింద నలుపు, వాపు పెరిగి మానసిక సమస్యలు తలెత్తుతాయి. నిద్ర తక్కువైతే జ్ఞాపక శక్తి తగ్గుతుంది. అనారోగ్య సమస్యలు తలెత్తుతాయి.

నిద్ర తక్కువైతే ప్రమాదం



నిద్ర పిల్లలకు, పెద్దలకు ఎంతో అవసరం. ఆరోగ్యంలో దీని ప్రభావం చాలా ఎక్కువ. పదేళ్ల లోపు చిన్నారులు రోజుకు 8-10 గంటలు నిద్రపోవాలి. లేదంటే ఎదుగుదలపై ప్రభావం చూపుతుంది. చిన్నతనంలోనే దీర్ఘకాలిక అనారోగ్య సమస్యలను ఎదుర్కోవాల్సి వస్తుంది. క్రమంగా జ్ఞాపక శక్తి తగ్గిపోతుంది. రాత్రిళ్లు సెల్‌ఫోన్లు ఇవ్వడం వలన నిద్ర తక్కువై ఆ ప్రభావం మొదట్లోనే కళ్లపైనే చూపుతుంది. తరువాత ఊబకాయం, చర్మవ్యాధులు, నరాల సమస్యలు తలెత్తుతాయి. పెద్దలకు కూడా రోజుకు ఏడు గంటల నిద్ర లేకపోతే శారీరక, మానసిక సమస్యలను ఎదుర్కోవాల్సి వస్తుంది. గుండె జబ్బు, రక్తంలో ఆక్సీజన్ స్థాయి తగ్గడం, రోగ నిరోధక వ్యవస్థ దెబ్బతినడం, దీర్ఘకాలిక వ్యాధులకు దగ్గరవుతారని పరిశోధనలు కూడా చెబుతున్నాయి.

- డాక్టర్ మనోహర్, చిన్నపిల్లల విభాగాధిపతి, రుయాస్పత్రి

నిద్రపోకుండా ఇలా సెల్‌ఫోన్ చూడటం ప్రమాదకరం

సుఖ నిద్రకు ఇలా చేస్తే మంచిది



మానసిక సమస్యలతో ఆస్పత్రికి వచ్చే వారిలో చాలా మంది నిద్ర సక్రమంగా పట్టనివారే. శరీరానికి వ్యాయామం ఎంత అవసరమో మానసిక దృఢత్వానికి నిద్ర కూడా అంతే అవసరం. నిద్రకు 2-3 గంటల ముందు భోజనం ముగించాలి. సులువుగా జీర్ణమయ్యే ఆహారం తీసుకోవాలి. పాలు, తక్కువ కొవ్వు ఉండే పదార్థాలు తీసుకోవడం మంచిది. నిద్రకు ముందు కెఫిన్, ఆల్కాహాల్‌ను నివారించాలి. సెల్‌ఫోన్లు, టీవీలను చూడకూడదు. పడుకునే గది చల్లగా, ప్రశాంతంగా, చీకటిగా ఉండేలా చూసుకోవాలి. బెడ్ మీదకు చేరాక కాస్సేపు పుస్తకాలు చదవడం, స్నానం చేయడం, ఇష్టమైన సంగీతం వినడం చేయాలి. ఆరోజు జరిగినవన్నీ పడుకునేముందు మననం చేసుకోకూడదు. పడుకున్న 20 నిముషాలకూ నిద్రరాకపోతే అరు బయటకు వెళ్లి విశ్రాంతినిచ్చే చిన్నపనులు చేస్తే నిద్ర పడుతుంది.

- డాక్టర్ మానస, మానసిక వైద్య నిపుణురాలు, రుయాస్పత్రి

సర్వదర్శనానికి 12 గంటలు

తిరుమలలో వేంకటేశ్వరస్వామి దర్శనానికి 12 గంటల సమయం పడుతోంది. శుక్రవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లోని 24 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 6 కంపార్టు మెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచిఉన్నారు.

బుధవారం హుండీ ఆదాయం: రూ.3.56 కోట్లు
గురువారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు : 51,148
తలనీలాలు సమర్పించినవారు: 21,236

ప్రాణం తీసిన వేగం

- ఆగివున్న లారీని ఢీకొన్న బైక్.. హోసూరు యువకుడి మృతి

పెళ్లకూరు, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనంపై వేగంగా వెళ్తూ ఆగివున్న లారీని ఢీకొనడంతో హోసూరు పట్టణానికి చెందిన యువకుడు దుర్మరణం చెందిన ఘటన పెళ్లకూరు మండలంలోని పెన్నేపల్లి వద్ద 71వ జాతీయ రహదారిపై శుక్రవారం ఉదయం జరిగింది. పోలీసుల సమాచారం మేరకు వివరాలు... తమిళనాడు రాష్ట్రం కృష్ణగిరి జిల్లా హోసూరు పట్టణానికి చెందిన అప్పునూ, భారతి దంపతుల కుమారుడు ప్రదీప్ అప్పునూ(27) జర్మనీలో ఇంజనీరింగ్ పూర్తి చేశాడు. హోసూరు పట్టణంలో ప్రదీప్ ఇంజినీరింగ్ కంపెనీ పేరుతో పరిశ్రమ నిర్వహిస్తున్నాడు. జర్మనీలో తనతో పాటు ఇంజనీరింగ్ చదివిన స్నేహితుడి వివాహం శుక్రవారం రాత్రి విజయవాడలో జరుగనుంది. మిత్రుడి వివాహానికి హాజరయ్యేందుకు గురువారం రాత్రి 10.30 గంటలకు బజాజ్ 400సీసీ బైక్‌పై హోసూరు నుంచి విజయవాడకు బయలుదేరాడు. పెళ్లకూరు మండలంలోని పెన్నేపల్లి వద్ద 71వ జాతీయ రహదారిపై ఆగివున్న లారీని వేగంగా ఢీకొని డివైడర్‌కు అమర్చిన ఇనుప చువ్వలకు మధ్యలో ఇరుక్కుపోయిన ప్రదీప్ అప్పునూ అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న ఎస్‌ఐ నాగరాజు సంఘటనా స్థలానికి చేరుకొని ప్రదీప్ అప్పునూ మృతదేహాన్ని నాయుడుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పోస్టుమార్టం పూర్తయ్యాక బంధువులకు అప్పగించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని, హెల్మెట్ ధరించి ఉన్నా తలకు తీవ్ర గాయాలై మృతి చెందడంతో బైక్ వేగాన్ని అంచనా వేయలేకపోతున్నట్లు ఎస్‌ఐ నాగరాజు చెప్పారు.





ప్రదీప్ అప్పూ (ఫైల్‌ఫొటో) - లారీ, ఇనుప ఊచల మధ్య ఇరుక్కు పోయిన బైక్



సభ వద్ద నాగబాబు భార్య



సభకు కదలివచ్చిన అశేష ప్రజానీకం..అభివాదం చేస్తున్న పవన్



మేం సైతం : సభకు కదలివచ్చిన దివ్యాంగులు

జనషోన

పవనుడు అందరివాడు..



పిఠాపురం, మార్చి 14 (ఆంధ్రజ్యోతి) : పవన్ సభకు ఎక్కడెక్కడి నుంచో అభిమానులు తరలివస్తారు. దానికి తగినట్టు ఏర్పాట్లు కూడా చేశారు. ఇతర రాష్ట్రాల నాయకులు, జనసైనికులు, వీరమహిళలు, అభిమానుల కోసం ఆయా భాషల్లో బోర్డులు ఏర్పాటు చేశారు. జయకేతనం అంటూ తమిళం, కన్నడ, హిందీ తదితర భాషల్లో ఏర్పాటు చేసిన బోర్డులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. సభ వద్ద కర్నాటక రాష్ట్రానికి చెందిన జన సైనికులు కన్నడ భాషలో రాసి ఉన్న ప్లకార్డులు ప్రదర్శించారు.

పవన్ అభిమానం

జనసైనికా.. కూల్..కూల్..



పిఠాపురం,/కాకినాడ కలెక్టరేట్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి) : రండి బాబు రండి పుచ్చకాయలు తిని వెళ్లండి.. లేదంటే మజ్జిగ తాగి వెళ్లండి.. ఏదైనా మీ చాయిస్ అంటూ దారి పొడవునా జనసైనికులను చల్లబరిచారు.. చిత్రాడ జనసేన ఆవిర్భావ సభకు అటు, ఇటూ పది కిలోమీటర్ల దూరం వరకూ ఎక్కడిక్కడ ఏర్పాటు చేసిన ఉచిత కౌంటర్ల ద్వారా ఉదయం నుంచి రాత్రి వరకూ పిలిచి మరీ అందించారు. మజ్జిగ ప్యాకెట్లతో పాటు వాటర్ ప్యాకెట్లు భారీ ఎత్తున పంపిణీ చేశారు.


పచ్చని స్వాగతం..



పర్యావరణ ప్రాధాన్యతను వివరిస్తూ కాకినాడ సర్పవరం జంక్షన్ నుంచి చిత్రాడ వరకూ పచ్చని స్వాగతద్వారాలు ఏర్పాటు చేశారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో అన్ని వర్గాలకు మేలు చేసే పలు కార్యక్రమాలు నిర్వహించిన విశిష్ట వ్యక్తులు పిఠాపురం మహారాజా సూర్యారావు బహద్దూర్, మల్లాడి సత్యలింగ నాయకర్, డొక్కా సీతమ్మ పేర్లను స్వాగత ద్వారాలకు పెట్టడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

9 చోట్లా ఇంతే

చిత్రాడలో నిర్వహించిన జయకేతనం సభకు సంబంధించి 9 ప్రాంతాల్లో పార్కింగ్ ప్రదేశాలు కేటాయించారు. ప్రతి చోటా వాహనాలన్నీ ఇలా బారులుతీరాయి. బస్‌లు, కార్లు, ద్విచక్రవాహనాలతో ఎక్కడికక్కడ నిండిపోయాయి.



జయకేతనం.. విజయకేతనమే.. యువత ఉప్పొంగింది.. చిత్రాడను ముంచెత్తింది.. ఎటు చూసినా ఎక్కడ చూసినా జనమే జనం.. కాకినాడ జిల్లా పిఠాపురం మండలం చిత్రాడ వీధులన్నీ జనంతో నిండిపోయాయి.. జై పవన్.. జై జై పవన్ నినాదాలతో మార్మోగిపోయాయి.. డిప్యూటీ సీఎం.. పిఠాపురం ఎమ్మెల్యేగారి తాలూకా బైక్‌లతో నిండిపోయాయి.. కార్లు.. ఆటోలు.. బస్‌లు క్యూకట్టాయి.. రకరకాల విన్యాసాలు చేసుకుంటూ జనసైన్యం కదిలింది.. పవన్‌పై అభిమానం చాటింది. శుక్రవారం తెల్లవారుజాము నుంచే జనసైనికులు తరలిరావడం ఆరంభించారు.. ఆలస్యంగా వెళితే అన్నను వెనుక నుంచి చూడాలని ముందుగానే జయకేతనం సభ నిర్వహించే చిత్రాడకు చేరుకున్నారు.. లక్షలాది మందితో గ్రామం కిక్కిరిసిపోయింది..

మొక్కు తీరుద్దామని..



పిఠాపురం : 2024 అసెంబ్లీ ఎన్నికల్లో పవన్‌కల్యాణ్ విజయం సాధిస్తే వైజాగ్‌లోని కనకమహాలక్ష్మి.. తిరుమల వెంకటేశ్వరస్వామి.. హైదరాబాద్‌లోని పెద్దమ్మతల్లి గుడికి వస్తానని అనకాపల్లి జిల్లా పాయకరావుపేటకు చెందిన జనసైనికుడు గుత్తుర్తి విజయబాబు మొక్కుకున్నాడు. సైకిల్‌పై మొక్కు తీర్చుకునేందుకు తిరుపతికి బయలుదేరి చిత్రాడలో జరుగుతున్న జనసేన సభ వద్దకు వచ్చారు. సభ చూసిన తర్వాత తిరుమలకు సైకిల్‌పై వెళతానని విజయబాబు తెలిపారు.



చిత్రాడదారులన్నీ జనపవనమై..

వరసిద్ధుడి దర్శనానికి 3 గంటలు



క్యూలైన్లలో వేచి ఉన్న భక్తులు

ఐరాల(కాణిపాకం), మార్చి 14 (ఆంధ్రజ్యోతి): స్వయంభు కాణిపాక వరసిద్ధి వినాయక స్వామి ఆలయం శుక్రవారం భక్తులతో కిక్కిరిసింది. హోలీ సెలవు కావడంతో వందలాది మంది స్వామి దర్శనార్థం ఆలయానికి విచ్చేయడంతో క్యూలైన్లు నిండిపోయాయి. స్వామి దర్శనానికి సుమారు మూడు గంటల సమయం పట్టింది. క్యూలైన్లలో భక్తుల మధ్య తొక్కిసలాటలు జరగకుండా ఆలయ అధికారులు జాగ్రత్తలు తీసుకున్నారు.

పలమనేరు బాలాజీకి కెనడా తెలుగుతల్లి పురస్కారం



పలమనేరు, మార్చి14 (ఆంధ్రజ్యోతి) : కెనడా తెలుగుతల్లి, శ్రీ గుర్రాల లక్ష్మీప్రసాద్ స్మారక పురస్కారానికి రచయిత, పెద్దపంజాణి ఎంపీడీవో పలమనేరు బాలాజి ఎంపికయ్యారు. తెలుగు సాహిత్యంలో తొలి ఎరుకల కథాసంపుటి ఏకలవ్య కాలనీలో ఎరుకల జీవన గాథలను రచయిత చిత్రించారు. ఎరుకల జీవితాల్లో మార్పుకోసం, పేదరిక నిర్మూలన కోసం, అస్థిత్వచైతన్యం కోసం చేసే పోరాటాన్ని చిత్రీకరించినందుకు గాను ఈ పురస్కారం అందించనున్నారు. కెనడానుంచి వెలువడే తెలుగుతల్లి సాహిత్య పత్రిక, జీ అండ్ జీ ట్రస్టు సంయుక్తంగా ఈ పురస్కారాలు అందిస్తున్నాయి.

వాహనం అదుపుతప్పి రైతు మృతి



బిన్నం వెంకటరమణ (ఫైల్‌ఫొటో)

సోమల, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): సోమల మండలం కరకమందకు చెందిన బిన్నం వెంకటరమణ (65) శుక్రవారం ద్విచక్ర వాహనంలో ప్రయా ణిస్తూ అదుపుతప్పి పడి మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు... కరకమందకు చెందిన రైతు బిన్నం వెంకటరమణ ట్రాక్టర్‌తో మామిడి చెట్లకు మందులు పిచికారీ చేయిస్తు న్నాడు. ఈ నేపథ్యంలో శుక్రవారం సోమలకు చెందిన రైతుల పొలాల వద్దకు డ్రైవర్‌తో పాటు వెళ్లాడు. మధ్యాహ్నం భోజన విరామంలో ద్విచక్రవాహనంలో కరకమందకు వస్తుండగా సోమల - తిరుపతి రోడ్డు మార్గంలోని నడింపల్లె మిట్ట వద్ద ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించబోయి పక్కనే ఉన్న నల్లగుండ్లను ఢీకొన్నాడు. ప్రమాదంలో తలకు బలమైన గాయమైంది. కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం తిరుపతికి తరలిస్తుండగా మార్గం మధ్యలో మృతిచెందాడు. పోలీసులు విచారిస్తున్నారు.

ఎస్వీయూలో జర్మన్ భాష అభ్యసన కేంద్రం

స్టడీ వింగ్స్ ప్రతినిధులతో అధికారుల సమావేశం

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మార్చి 14 (విశ్వవిద్యాలయాలు): ఎస్వీయూలో జర్మన్ భాష అభ్యసన కేంద్రాన్ని ఏర్పాటు చేసేందుకు కసరత్తు చేస్తున్నారు. ఇందులో భాగంగా స్టడీ వింగ్స్ సంస్థ ప్రతినిధుల బృందం వర్సిటీ అధికారులతో శుక్రవారం సమావేశమైంది. ఇరు సంస్థల ప్రతినిధులు మాట్లాడుతూ జర్మనీలో విద్యా, ఉద్యోగావకాశాలు మెండుగా ఉన్నాయన్నారు. ఇవి పొందాలంటే జర్మన్ భాష నేర్చుకోవాలన్నారు.ఇందుకోసం యూనివర్సిటీలో జర్మన్ భాష అభ్యసన కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని భావిస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో వీసీ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతి నాయుడు, జర్మన్ స్టడీ వింగ్స్ ప్రతినిధులు నరేంద్రరెడ్డి, సుకన్య పాల్గొన్నారు.

భక్తులతో మర్యాదగా మసలుకోండి

సంభాషించేటప్పుడు గణేశా అని మొదలుపెట్టండి - వరసిద్ధుడి ఆలయ సిబ్బందికి ఈవో సూచన



సమావేశంలో ప్రసంగిస్తున్న పెంచలకిషోర్

ఐరాల (కాణిపాకం), మార్చి 14 (ఆంధ్రజ్యోతి): స్వయంభు కాణిపాక వరసిద్ధి వినాయక స్వామి ఆలయానికి విచ్చేసే ప్రతి భక్తుడితో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని సిబ్బందికి ఈవో పెంచలకిషోర్ సూచించారు. శుక్రవారం ఆలయ సమావేశ మందిరంలో అర్చకులు, వేదపండితులు, సిబ్బందితో సమీక్షించారు. భక్తులతోనూ.. సెల్‌ఫోన్‌లోనూ.. ఆలయ సెట్‌లోనూ సంభాషించేటప్పుడు గణేశా అని మొదలుపెట్టాలని ఈవో చెప్పారు. టికెట్ కౌంటర్లలో పనిచేసే సిబ్బంది భక్తులకు ఓర్పుతో సమాధానం ఇవ్వాలన్నారు. క్యూలైన్లలో వేచి ఉండేవారికి త్వరగా స్వామి దర్శనమయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఆలయ ఖ్యాతిని పెంచడానికి ప్రతి ఉద్యోగి కృషి చేయాలని పిలుపునిచ్చారు. ముఖ్యంగా ఆలయం వద్ద పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని కోరారు. ఈఈ వెంకటనారాయణ, ఏఈవోలు రవీంద్రబాబు, ఎస్వీ కృష్ణారెడ్డి, ధనంజయ, హరిమాధవరెడ్డి, ప్రసాద్, సూపరింటెండెంట్లు వాసు, కోదండపాణి తదితరులు పాల్గొన్నారు.

బాస్కెట్‌బాల్ రాష్ట్ర జట్ల ఎంపిక



రాష్ట్ర జట్లకు ఎంపికైన క్రీడాకారులతో అసోసియేషన్ నాయకులు, కోచ్‌లు

చిత్తూరు క్రీడలు, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): బాస్కెట్‌బాల్ అండర్-23 పురుషుల, మహిళా రాష్ట్ర జట్లను ఎంపిక చేసినట్లు రాష్ట్ర బాస్కెట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు చెంగల్రాయ నాయుడు శుక్రవారం ప్రకటించారు. గత నెల విజయవాడలో జరిగిన పోటీల్లో ప్రతిభ చూపిన మహిళ, పురుషుల్లో 25 మంది చొప్పున ఎంపిక చేసి.. చిత్తూరులో శిక్షణ ఇచ్చినట్లు ఆయన తెలిపారు. వీరిలో ఉత్తమ ప్రతిభ చూపిన 12 మంది చొప్పున క్రీడాకారులను జాతీయ జట్టుకు ఎంపిక చేసినట్లు చెప్పారు. వీరు ఈ నెల 18 నుంచి 24వ తేదీవరకు అసోం రాష్ట్రంలోని గౌహతిలో జరిగే జాతీయస్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన ట్రాఫిక్ సీఐ నిత్యాబాబు మాట్లాడుతూ.. క్రమశిక్షణతో కసరత్తు చేస్తే ఉన్నతస్థాయి క్రీడాకారులుగా ఎదుగుతారన్నారు. అసోసియేషన్ జిల్లా ఉపాధ్యక్షుడు ఎన్‌పీ జయప్రకాష్, కార్యదర్శి సురేష్‌బాబు, కోచ్‌లు నాగరాజు, రుద్ర, బాబు, జాను, రాజేశ్వరి, బీఎస్‌డీవో బాలాజి తదితరులు పాల్గొన్నారు.

మహిళా జట్టు

లీలాకుమారి(కెప్టెన్), కుసుమ కుమారి, సంజన, నాగదేవి, నాగ వినయశ్రీ, విజయ దుర్గ, మహతి, అనిత, గౌతమి, తిరుపతమ్మ, రోహిత, సాయి జోతిక.

పురుషుల జట్టు

అమృతరాజ్(కెప్టెన్), ద్వారకానాథ్ రెడ్డి, సత్యప్రకాష్, బాలాజి, శశాంక్, ఫణీంద్ర ఆదినారాయణ, రాహుల్, నగేష్‌బాబు, యశ్వంత్ కుమార్, ప్రేమ్‌కుమార్, సయ్యద్ ఇంతియాజ్, ఆకాష్.

పంటలపై ఆగని గజరాజుల దాడులు





దళవాయిపల్లెలో మామిడి చెట్లు, పైపుల ధ్వంసం - పెరగాండ్లపల్లె వద్ద తొక్కేసిన వరిపంట

యాదమరి, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): యాదమరి మండలంలోని పంటలపై ఏనుగుల గుంపు దాడి చేసింది. కొంతకాలంగా బంగారుపాళ్యం, యాదమరి సరిహద్దుల్లో గజరాజులు సంచరిస్తున్నాయి. తాజాగా యాదమరి మండల పరిధిలోని బోడబండ్ల బీట్ తాళ్లమడుగు, దళవాయిపల్లె, భూమిరెడ్డిపల్లె, రాచూరు బీట్ ప్రాంతంలోని పంటలపై పడి ధ్వంసం చేశాయి. నుంజర్ల చెరువులో 19 ఏనుగుల గుంపు పగలు తిష్ఠ వేసి, రాత్రివేళల్లో పొలాలపై దాడికి దిగుతుండడంతో సమీపంలో గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. గురువారం రాత్రి దళవాయిపల్లెకు చెందిన రైతు రవీంద్రబాబు పొలంలోని బోరుబావి పైపులు, డ్రిప్ ఇరిగేషన్ పరికరాలు, వరి, మామిడి, టెంకాయ చెట్లను ధ్వంసం చేశాయి. పెరగాండ్లపల్లెలోని రైతు జగన్నాథంకు చెందిన గానుగ షెడ్డు, బోరుబావి పైపులు, మురగయ్యకు చెందిన వరి, మామిడి పంటలు నాశనం చేశాయి. విషయం తెలుసుకున్న అటవీ సిబ్బంది ట్రాకర్ల సాయంతో బాణాసంచా పేల్చి ఏనుగులు జనావాసాల్లోకి రాకుండా అడవిలోకి మళ్లించే ప్రయత్నం చేశారు. ధ్వంసమైన పొలాలను ఎఫ్‌బీవోలు ప్రతాప్, డిల్లీరాణి పరిశీలించారు.

వైభవంగా కోదండరాముడి రథోత్సవం



రథం లాగుతున్న నారా భువనేశ్వరి, ఎమ్మెల్సీ కంచర్ల తదితరులు



కుప్పం/శాంతిపురం, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): శాంతిపురం మండలం రాళ్లబూదుగూరులో వెలసిన కోదండరామస్వామి రథోత్సవం శుక్రవారం అంగరంగ వైభవంగా జరిగింది. ఆలయంలోని మూల విరాట్టుకు ఉదయం అభిషేకాలు, విశేష పూజలు ముందుగా నిర్వహించారు. అనంతరం రథాన్ని సర్వాంగ సుందరంగా అలంక రించి, అప్పటికే సర్వాలంకారాలతో సిద్ధం చేసిన కోదండరాముడి ఉత్సవ మూర్తిని అందులో అధిష్ఠింపజేశారు. ముఖ్యమంత్రి సతీమణి నారా భువనేశ్వరి మధ్యాహ్నం ఒంటి గంట ప్రాంతంలో బెంగళూరునుంచి రాళ్లబూదుగూరు చేరుకున్నారు. వాహనం దిగి, అప్పటికే చేరిన భక్తులకు అభివాదం చేస్తూ రథం దగ్గరికి వచ్చారు. ఆమె వచ్చాక రథోత్సవం ప్రారంభమైంది. భువనేశ్వరి రథం లాగడంతో పాటు కోదండరాముని దర్శించుకుని, మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ పురాతనమైన కోదండరామస్వామి ఆలయ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం తరఫున ముఖ్యమంత్రి చంద్రబాబు రూ.7.85 కోట్లు మంజూరు చేశారని చెప్పారు. ఆలయం అభివృద్ధి చెంది రాళ్లబూదుగూరు గ్రామం మహా పుణ్యక్షేత్రంగా విలసిల్లాలని ఆకాంక్షించారు.రథోత్సవ సందర్భంగా రాళ్లబూదు గూరు గ్రామం మొత్తం జనసందోహంతో నిండిపోయింది.ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, ఆర్టీసీ వైస్ ఛైర్మన్ పీఎస్.మునిరత్నం, స్థానిక టీడీపీ నాయకులు భువనేశ్వరి వెంట ఉన్నారు.

పూరేడువారిపల్లెలో ఒంటరి ఏనుగు హల్‌చల్



ఒంటరి ఏనుగు దాడిలో ధ్వంసమైన వరిపంట

కల్లూరు, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): పులిచెర్ల మండలం పూరేడువారిపల్లెలో గురువారం రాత్రి ఒంటరి ఏనుగు హల్‌చల్ చేసింది. వరి, కొబ్బరి చెట్లను ఒంటరి ఏనుగు ధ్వంసం చేసింది. కల్లూరు నుంచి గంటావారిపల్లెకు వెళ్లే మార్గం సమీపంలోని పశ్చిమవిభాగం అటవీ ప్రాంతం నుంచి ఏనుగు గురువారం రాత్రి పంచాయతీలోకి వచ్చింది. కల్లూరు శివాలయం, హైస్కూలు, సినిమా థియేటర్ వెనుకవైపు మామిడితోటల్లో కొమ్మలను విరుచుకుంటూ కల్లూరు- సదుం రోడ్డు వద్దకు చేరుకుంది. ఒంటరి ఏనుగు దాడులతో రహదారిపై వెళ్లే ప్రజలు భయాందోళనకు గురయ్యారు. పూరేడువాండ్లపల్లెలోని రైతు మునిరత్నమ్మకు చెందిన వరిపంటను ధ్వంసం చేసింది. మరో రైతు సత్యనారాయణకు చెందిన నాలుగు కొబ్బరిచెట్లను విరిచేసింది. అక్కడి నుంచి వచ్చిన దారిలోనే వెనుదిరిగిన ఒంటరి ఏనుగు అడవిలోకి చేరుకున్నట్లు ఎఫ్‌బీవో శ్రీదేవి తెలిపారు.





ప్రకృతి ఒడిలో కాలినడకన కుమారధార తీర్థ యాత్ర



ముక్కోటికి పోటెత్తిన భక్తజనం



తిరుమల, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): ఆహ్లాదకరమైన వాతావరణం, పచ్చని చెట్లు నడుమ రాళ్లురప్పలు దాటుతూ, భారీ లోయల్లోకి దిగుతూ, ఎక్కుతూ శేషాచల కొండల్లోని కుమారధారతీర్థానికి శుక్రవారం భక్తజనం పోటెత్తారు. ప్రతి ఏడాది పాల్గుణ పౌర్ణమినాడు టీటీడీ కుమారధార తీర్థముక్కోటిని నిర్వహిస్తోంది. శుక్రవారం ఉదయం 5 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు భక్తులను తీర్థానికి అనుమతించారు. తిరుపతి, తిరుమల స్థానికులతో పాటు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తీర్థాన్ని సందర్శించారు.లోయల్లోకి దిగుతూ, జారే బండల మీదుగా కొండలు ఎక్కుతూ సాగిపోయారు. పదేళ్ల పిల్లలు మొదలు వృద్ధుల దాకా ఈ తీర్థయాత్రలో ఉత్సాహంగా నడిచారు. అనేక చోట్ల టీటీడీ నిచ్చెనలు ఏర్పాటు చేసింది. కొన్ని చోట్ల మోకులు కట్టి పట్టుకుని నడిచే ఏర్పాటు చేశారు. పాపవినాశనం వద్ద టిఫిన్‌లు ఏర్పాటు చేశారు. దారిలోనూ నిరంతరాయంగా అన్నప్రసాదాలు, తాగునీరు, మజ్జిగ వంటివి ఇచ్చారు. భద్రత, వైద్య సిబ్బందిని ఏర్పాటు చేశారు. రద్దీ పెరగడంతో అక్కడక్కడా భక్తులను ఆపేసి, పంపారు. ముఖ్యంగా తీర్థం వద్ద ఎక్కేందుకూ దిగేందుకూ ఒక్కటే నిచ్చెన దారి ఏర్పాటు చేయడంతో గంటన్నర పాటు భక్తులు ఆగిపోవాల్సి వచ్చింది. శుక్రవారం దాదాపు ఆరు వేల మంది కుమారతీర్థానికి నడిచి కుమారస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

మా సిఫార్సు లేఖలు తీసుకోకుంటే..

- తెలంగాణ ప్రజాప్రతినిధులందరం తిరుమలకు వచ్చి చూసుకుంటాం
- బీజేపీ ఎంపీ రఘునందన రావు



శ్రీవారి ఆలయం ఎదుట కుటుంబ సభ్యులతో రఘునందనరావు

తిరుమల, మార్చి14(ఆంధ్రజ్యోతి): 'తిరుమల శ్రీవారి వీఐపీ బ్రేక్ దర్శనాల కోసం మా సిఫార్సు లేఖలు తీసుకోకుంటే తెలంగాణ ప్రజాప్రతినిధులందరం కలిసి ఒక రోజు తిరుమలకు వస్తాం. టీటీడీ ఏం చేస్తుందో ఆరోజు చూసుకుంటాం. తెలంగాణ ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, ఎంపీల సిఫార్సు లేఖలను రేపటి నుంచి తీసుకోవాలి' అంటూ బీజేపీ ఎంపీ రఘునందన రావు ఆగ్రహించారు. తిరుమల శ్రీవారిని శుక్రవారం దర్శించుకున్న ఆయన ఆలయం ముందు మీడియాతో మాట్లాడారు. తెలంగాణ ప్రజాప్రతినిధులు పంపిస్తున్న లేఖలను ఫిబ్రవరి 1వ తేదీ నుంచి తీసుకుంటామని టీటీడీ బోర్డు తీర్మానం చేసిందన్నారు. ఉమ్మడి ఏపీలో 294 మంది ఎమ్మెల్యేలు పంపించే సిఫార్సు లేఖలను తీసుకుని వీఐపీ బ్రేక్ దర్శనం, వసతి కల్పించేవారన్నారు. ఏపీ రెండు రాష్ట్రాలుగా విడిపోయిన తర్వాత తెలంగాణ ప్రాంత ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, ఎంపీలు ఇస్తున్న లేఖలను చంద్రబాబు ప్రభుత్వం వచ్చిన తర్వాత తిరిగి ఫిబ్రవరి నుంచి తీసుకుని దర్శనం కల్పిస్తామని చెప్పారన్నారు. ప్రస్తుతం మార్చి నెల వచ్చినప్పటికీ ఎలాంటి స్పందన లేదన్నారు. 294 మంది ఎమ్మెల్యేల లేఖలను తీసుకున్న టీటీడీ ప్రస్తుతం కేవలం 153 మందికి మాత్రమే పరిమితం కావడం బాధాకరమన్నారు. సీఎం ఆదేశించినా, బోర్డు తీర్మానం చేసినా తమ సిఫార్సు లేఖలను తీసుకోవడం లేదని ఆగ్రహించారు. ఈ వివక్షపై టీటీడీ ఆలోచన చేయాలన్నారు. వెంటనే ఈ అంశంపై టీటీడీ బోర్డు అత్యవసర సమావేశాన్ని నిర్వహించాలన్నారు. తెలంగాణ ప్రజాప్రతినిధుల న్యాయమైన కోరికపై సీఎం చంద్రబాబు కూడా స్పందించాలన్నారు.కాగా శ్రీవారి దర్శనం కోసం తెలంగాణ ప్రజాప్రతినిధుల సిఫార్సు లేఖలను తీసుకోవాలని సీఎం రేవంత్‌రెడ్డి రాసిన లేఖకు ఏపీ సీఎం చంద్రబాబు స్పందించి అంగీకారం తెలిపినప్పటికీ టీటీడీ అధికార యంత్రాంగం స్పందించడం లేదని, తమ లేఖలను తీసుకోవడం లేదని తెలంగాణ ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. తిరుమల శ్రీవారిని శుక్రవారం దర్శించుకున్న ఆయన ఆలయం ముందు మీడియాతో మాట్లాడారు.

సింగిల్‌విండో సీఈవో కుటుంబానికి సాయం


సుబ్రహ్మణ్యం భార్యకు ఆర్థికసాయం అందజేస్తున్న సంఘం నేతలు

రామకుప్పం, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): ఇటీవల గుండె సంబంధిత వ్యాధితో మృతి చెందిన రామకుప్పం సింగిల్ విండో సీఈవో సుబ్రహ్మణ్యం కుటుంబానికి కో-ఆపరేటివ్ సర్వీస్ అసోసియేషన్ జిల్లా కార్యవర్గం రూ.40 వేలు ఆర్థిక సాయం అందించింది. అసోసియేషన్ రాష్ట్ర, జిల్లా నేతలు శ్రీనివాసులురెడ్డి, బాబు, శివారెడ్డి తదితరులు శుక్రవారం కెంచనబల్లకు చేరుకుని ఆర్థికసాయం మొత్తాన్ని సుబ్రహ్మణ్యం కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ నేతలు తులసీపిళ్లై, విజయ్‌కుమార్‌రెడ్డి, రమేష్, వెంకటరమణ, దిలీప్‌రామ్మూర్తి, శ్రీధర్, మురుగన్ తదితరులు పాల్గొన్నారు.

టెన్త్ విద్యార్థులు పరీక్షల్లో ప్రతిభ చూపాలి


పూజల్లో పాల్గొన్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

రామకుప్పం, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి విద్యార్థులు పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబరచాలని రెస్కో మాజీ డైరెక్టర్ గంట్లరెడ్డి, టీడీపీ యూనిట్ ఇన్‌చార్జి వెంకటరమణ కోరారు. శుక్రవారం రామకుప్పం మండలం కెంపసముద్రం జడ్పీ ఉన్నత పాఠశాలలో జరిగిన పదో తరగతి విద్యార్థుల వీడ్కోలు కార్యక్రమంలో వారు మాట్లాడారు. విద్యార్థులు పరీక్షలంటే భయాన్ని విడనాడి ఉపాధ్యాయుల సూచనల మేరకు చదువుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు నారాయణ, నేతలు కోదండరెడ్డి, సురేష్, వెంకటరమణ, శంకరప్ప, పలువురు ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పంటలకు చీరల రక్ష..!


సోమలలో ముల్లంగి పంటకు రక్షణగా ఏర్పాటు చేసిన చీరలు

సోమల, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఉద్యానపంటలు అధికంగా సాగవుతున్నాయి. రైతన్నలు తమ పంటలకు చీడపీడలు సోకకుండా, తెగుళ్లు రాకుండా పొలం చుట్టూ పాత చీరలు రక్షణగా కడుతున్నారు. వేల రూపాయలు వ్యయం చేయలేని సామాన్య, మధ్య తరగతి రైతులు ఒక్కో చీర రూ.10లకు కొనుగోలు చేసి పొలం చుట్టూ రంగు రంగు చీరలను కడుతున్నారు. అలాగే మండలంలో వన్యప్రాణులు అడవిపందులు, నెమళ్లు, దుప్పులు అధికంగా ఉండి తరచూ పంటలపైకి రావడంతో వాటి నుంచి రక్షణగా ఈ చీరలు ఉంటున్నాయని రైతులు తెలుపుతున్నారు. పశువులకు మేతగా వాడే మొక్కజొన్న పంటకు, కాలీఫ్లవర్, టమోటా, మిరప తోటల వద్ద పంటలకు రక్షణగా చీరలు కడుతున్నారు.

సదుంలో తప్పని ట్రాఫిక్ కష్టాలు..!


సదుం రోడ్డుపై స్తంభించిన ట్రాఫిక్

సదుం, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): సదుంలో నిత్యం ట్రాఫిక్ సమస్యతో ఇటు పాదచారులకు, అటు వాహన చోదకులకు తీవ్ర ఇబ్బందికరంగా మారుతోంది. స్థానికంగా సుమారు 20 మంది పోలీసు సిబ్బంది ఉన్నప్పటికీ రోడ్డుపై పోలీసులు ఉండకపోవడంతో ద్విచక్ర వాహనదారులు ఎక్కడిపడితే అక్కడ వాహనాల పార్కింగ్‌తో నిత్యం ట్రాఫిక్ సమస్య ఎదురవుతోంది. కనీసం ఉదయం, సాయంత్రం వేళల్లో ట్రాఫిక్ నియంత్రణలో పోలీసులు డ్యూటీలు నిర్వహిస్తే ట్రాఫిక్ సమస్య తగ్గుతుందని పలువురు స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

కల్లూరు అడవికి ఆకతాయిల నిప్పు


కల్లూరు అటవీ ప్రాంతంలో చెలరేగుతున్న మంటలు

కల్లూరు, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): పులిచెర్ల మండలం కల్లూరు నుంచి దామలచెరువుకు వెళ్లే జాతీయ రహదారికి ఇరువైపులా ఉన్న అడవికి శుక్రవారం కొందరు ఆకతాయిలు నిప్పు పెట్టారు. దీంతో శుక్రవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు అడవిలో మంటలు చెలరేగుతూనే ఉన్నాయి. అడవి పైభాగంలో గడ్డి, బోద ఎక్కువగా ఉండటంతో మంటలు మరింతగా వ్యాపించాయి. ఆకతాయిల తప్పిదాలకు అడవులతో పాటు అనేక ఔషధ మొక్కలు, క్రిమి కీటకాలు కాలిపోతున్నాయి. మంటలకు మహావృక్షాలు సైతం నేలకొరుగుతున్నాయి. అటవీశాఖ అనుమతి లేకుండా అడవుల్లోకి ప్రవేశిస్తే చర్యలు తప్పవని, అడవులకు నిప్పుపెడితే జైలు శిక్ష తప్పదని అటవీశాఖ అధికారులు హెచ్చరిస్తున్నారు.

గడ్డివామి దగ్ధం

చౌడేపల్లె, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): చౌడేపల్లె మండలం కాటిపేరిలో గంగులప్పకు చెందిన గడ్డివామిలో శుక్రవారం గుర్తుతెలియని వ్యక్తుల కారణంగా మంటలు చెలరేగాయి. సమాచారం అందుకున్న అగ్నిమాపకశాఖ అధికారి సుబ్బరాజు తన సిబ్బందితో చేరుకుని మంటలను అదుపు చేశారు. ఆలోపే గడ్డివామి అగ్నికి ఆహుతైంది.

మతిస్థిమితం లేని యువకుడి ఆత్మహత్య

పుంగనూరు రూరల్, మార్చి 14 (ఆంధ్రజోతి): మతిస్థిమితం లేని ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన శుక్రవారం పుంగనూరు పట్టణంలో చోటుచేసుకుంది. వివరాలిలా.. పట్టణంలోని భగత్‌సింగ్‌కాలనీకి చెందిన అబ్దుల్ సాహెబ్ కుమారుడు సయ్యద్(24) మతిస్థిమితం లేక ఇంట్లో ఉరేసుకుని వేలాడుతుండగా కుటుంబ సభ్యులు గుర్తించారు. వెంటనే ప్రభుత్వాస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు డాక్టర్లు నిర్ధారించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

19న వారపుసంతలకు వేలం

వి.కోట, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): వి.కోట గ్రామ పంచాయతీలో పలు సంతలకు సంబంధించి ఈనెల 19న బుధవారం బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు సర్పంచ్ పి.ఎస్.లక్ష్మీ, ఈవో శివశంకర్ తెలిపారు. వేలంలో పాల్గొనదలచిన వారు నిర్ణీత మొత్తం డిపాజిట్ చెల్లించి గ్రామ పంచాయతీ కార్యాలయంలో జరిగే వేలంలో పాల్గొనాలని కోరారు.

కల్యాణం.. కమనీయం
లక్ష్మీనరసింహుడి వైభోగం..!


పుంగనూరులో భక్తులకు అన్నదానం


పుంగనూరు: రథంలో కొలువైన శ్రీవారు


కడపనత్తంలో నలగుంద్రాయస్వామి రథోత్సవం


కల్లూరు : దేవళంపేటలో లక్ష్మీ నరసింహస్వామి కల్యాణోత్సవం


అలంకరణలో బోయకొండ గంగమ్మ


చౌడేపల్లె: కదిరి లక్ష్మీనరసింహస్వామి


సోమల : శ్రీవారికి చక్రస్నానం

కల్లూరు, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): పులిచెర్ల మండలం దేవళంపేటలో భక్తుల పాలిట కొంగు బంగారంగా వెలసిన లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో జరుగుతున్న వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం స్వామి అమ్మవార్ల కల్యాణోత్సవం వేడుకలు కమణీయంగా జరిగాయి. ఆలయంలో ఉదయం అభిషేకాలు, అర్చనలు, హోమ పూజలు నిర్వహించారు. అనంతరం స్వామివారు సూర్యప్రభ వాహనంపై పురవీధుల్లో ఊరేగారు.

కనులపండువగా రథోత్సవం

పుంగనూరు: పట్టణంలోని కోనేటి వద్ద వెలసిన కల్యాణ వెంకటరమణస్వామి రథోత్సవం కనులపండువగా జరిగింది. బ్రహోత్సవాలల్లో భాగంగా శుక్రవారం టీటీడీ ఆధ్వర్యంలో స్వామి వారిని అర్చకులు ప్రత్యేకంగా అలంకరించి రథంలో కొలువుదీర్చారు. జమీందార్ల కుటుంబసభ్యులు ఆనవాయితీగా స్వామి వారికి తొలిపూజలు చేశారు. ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. కార్యక్రమంలో ఆలయ ఇన్‌స్పెక్టర్ మునీంద్రబాబు, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా రాహుకాల పూజలు

చౌడేపల్లె, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ శక్తి పుణ్యక్షేత్రమైన బోయకొండ గంగమ్మ ఆలయంలో శుక్రవారం శాస్త్రోక్తంగా రాహుకాల పూజలు నిర్వహించారు. అమ్మవారికి రాహుకాలంలో పసుపు, కుంకుమ, గంధం, పంచామృతాభిషేకాలతో అభిషేకాలు నిర్వహించారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. ఆలయ ఈవో, డిప్యూటీ కమిషనర్ ఏకాంబరం ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ఘనంగా కదిరి నరసింహుడి తిరుణాల

చౌడేపల్లె: మండలంలోని బైప్పల్లెలో వెలసిన కదిరి నరసింహస్వామి ఆలయంలో స్వామివారికి ఆలయ నిర్వాహకులు శుక్రవారం పంచామృతాభిషేకాలు నిర్వహించి, స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించారు. స్వామివారి ఉత్సవ మూర్తిని పుష్పపల్లకిలో ప్రత్యేకంగా అలకంరించి పురువీధుల్లో ఊరేగించారు.

లక్ష్మీనరసింహస్వామికి ప్రత్యేక పూజలు

పుంగనూరు రూరల్: మండలంలోని గూడూరుపల్లె సమీపంలో వెలసిన లక్ష్మీనరసింహస్వామి శుక్రవారం ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. పౌర్ణమి సందర్భంగా స్వామి వారిని ప్రత్యేక అలంకరణలు, అభిషేకాలు చేపట్టారు. వనమలదిన్నె, గుట్టకిందపల్లె సమీపాల్లో వెలసిన లక్ష్మీనరసింహస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పుంగనూరు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి హాజరుకావడంతో ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికి ప్రత్యేక పూజలు చేశారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చెన్నకేశవస్వామికి పౌర్ణమి పూజలు

రొంపిచెర్ల: మండలంలోని బొమ్మయ్యగారిపల్లె పంచాయతీలోని చెన్నకేశవస్వామి ఆలయంలో కదిరి పౌర్ణమి పురస్కరించుకుని స్వామి వారికి ప్రత్యేక పూజలు చేపట్టారు.

భక్తిశ్రద్ధలతో శ్రీవారికి చక్రస్నానం

సోమల: మండలంలోని ఆవులపల్లె ప్రసన్న వెంకటేశ్వరస్వామి ఆలయంలో తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాల్లో శుక్రవారం స్వామివారి వసంతోత్సవం, చక్రస్నానం కార్యక్రమాలు ఘనంగా చేపట్టారు. పెద్దఉప్పరపల్లె, ఆవులపల్లె, అన్నెమ్మగారిపల్లె, పేటూరు పంచాయతీల బ్రాహ్మణ, దేవాంగ సంఘ సభ్యులు ఉభయదారులుగా వ్యవహరించారు. ఆలయ ప్రధాన అర్చకులు గోపిస్వామి, టీటీడీ అధికారులు కార్యక్రమాలను పర్యవేక్షించారు.

వైభవంగా నలగుంద్రాయస్వామి రథోత్సవం

బైరెడ్డిపల్లె: మండలంలోని కడపనత్తం గ్రామంలో కొలువైన నలగుంద్రాయస్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం రథోత్సవం వైభవంగా జరిగింది. అలివేలు మంగ, పద్మావతీ సమేత నలగుంద్రాయస్వామి ఉత్సవమూర్తులకు ఆలయ అర్చకులు రామకృష్ణాచార్యులు ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు. అనంతరం స్వామివారిని రథంపై కొలువుదీర్చి శాస్త్రోక్తంగా రథోత్సవం చేపట్టారు. ఆలయ ధర్మకర్త మురళీస్వామి, కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

నారా భువనేశ్వరికి ఘనస్వాగతం


శాంతిపురం మండలం కదిరిముత్తనపల్లె సిద్దేశ్వరస్వామి సేవలో భువనేశ్వరి


కదిరిముత్తనపల్లెలో ప్రజలకు అభివాదం

రామకుప్పం/శాంతిపురం, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): శాంతిపురం మండల పర్యటనకు వచ్చిన సీఎం చంద్రబాబు సతీమణి, ఎన్టీఆర్ ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ నారా భువనేశ్వరికి శుక్రవారం రాష్ట్ర సరిహద్దులో టీడీపీ శ్రేణులు, తెలుగు మహిళా నేతలు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆమె అందరినీ పలకరిస్తూ యోగ క్షేమాలు అడిగి తెలుసుకున్నారు. శాసన మండలి విప్ కంచర్ల శ్రీకాంత్, ఆర్టీసీ వైస్‌చైర్మన్ మునిరత్నం, సీఎం పీఏ మనోహర్, మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు, టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి సురేష్‌బాబు, నాలుగు మండలాల టీడీపీ నేతలు చంద్రశేఖర్, విశ్వనాథనాయుడు, నాగరాజు, మునస్వామి, పత్రి నారాయణాచారి, ఆంజనేయరెడ్డి, ఆనందరెడ్డి, నరసింహులు, చిన్నికృష్ణ, బాబునాయుడు, కన్నన్, ఉదయ్‌కుమార్, ఆర్‌ఎస్ మణి, తెలుగు మహిళా నేతలు శ్యామల, అనసూయ, సరిత, సుగుణమ్మ, పద్మమ్మ, రాణెమ్మ తదితరులు స్వాగతం పలికిన వారిలో ఉన్నారు.


నారా భువనేశ్వరికి స్వాగతం పలుకుతున్న తెలుగుదేశం నేతలు


కురబల పెద్దదేవరలో కొబ్బరి కాయలు పగులగొట్టించుకోవడానికి సిద్ధమైన భక్తులు


సిద్దేశ్వరస్వామి ఆలయంలో భక్త ప్రదర్శన

ఘనంగా హోలీ సంబరాలు


బైరెడ్డిపల్లెలో హోలీ సంబరాలు జరుపుకుంటున్న మార్వాడీలు

కల్లూరు, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): పులిచెర్ల మండలం కల్లూరు పట్టణంలో శుక్రవారం హోలీ సంబరాలు ఘనంగా జరిగాయి. రాజస్థాన్ రాష్ట్రానికి చెందిన సుమారు 20 కుటుంబాలు కల్లూరు పట్టణంలో వివిధ రకాల వ్యాపారాలు కొనసాగిస్తున్నారు. శుక్రవారం హోలీ పండుగ సందర్భంగా అందరూ ఎంతో ఉత్సాహంగా రోడ్లపైకి చేరుకున్నారు. చిన్నారులు, యువత, మహిళలు తారతమ్యం లేకుండా రంగులు చల్లుకుంటూ తమ సంతోషాన్ని పంచుకున్నారు. ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

- చౌడేపల్లె: స్థానిక బస్టాండులో శుక్రవారం మార్వాడీలు హోలీ పండుగను జరుపుకున్నారు.
- సోమల: సోమల మండలంలో హోలీ పండుగ వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. చిన్నారులు, పెద్దలు రంగునీళ్ల చల్లుకుంటూ ఆనందోత్సవాలతో హోలీ వేడుకలు జరుపుకున్నారు. సోమల, పెద్దఉప్పరపల్లె, నంజంపేట, కందూరు తదితర ప్రాంతాల్లో హోలీ జరుపుకున్నారు.
- పుంగనూరు: పుంగనూరు అర్బన్, రూరల్ మండల పరిధిలో హోలీ పండుగను పురస్కరించుకుని శుక్రవారం సుగాలిమిట్టలో గిరిజనులు, పట్టణంలోని మహారాష్ట్ర, గుజరాత్ రాష్ట్రాలకు చెందిన వ్యాపారులు రంగులు చల్లుకుని హోలీ పండుగను జరుపుకున్నారు.
- రొంపిచెర్ల: రొంపిచెర్లలో శుక్రవారం యువత, మహిళలు ప్రజలు ఆనందంగా హోలీ పండుగ ఘనంగా జరుపుకున్నారు. రంగులు చల్లుకుంటూ మహారాష్ట్రకు చెందిన మార్వాడీ లు ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఎలాంటి సంఘటనలు జరగకుండా ఎస్‌ఐ సుబ్బారెడ్డి ముందస్తు చర్యలు తీసుకున్నారు. కార్యక్రమంలో రాఘవేంద్ర, మహేష్, నామిచంద్‌పటేల్, దర్గం, విసన్‌రాం, శంకర్‌జీ, దీపక్‌సోను, పర్వన్‌హరీష్, సంతోష్, హోటల్ శంకర్ తదితరులు పాల్గొన్నారు.
- సదుం: సదుంలో కాపురముంటున్న రాజస్థానీయులు శుక్రవారం హోలీ పర్వదినాన్ని ఘనంగా జరుపుకున్నారు. పండుగ సందర్భంగా దుకాణాలు మూసివేసి సెలవు ప్రకటించారు. సమూహంగా రోడ్లపైకి వచ్చి రంగులు చల్లుకుంటూ పరస్పరం శుభాకాంక్షలు తెలుపుకున్నారు. మిఠాయిలు పంచి పెట్టారు.
- బైరెడ్డిపల్లె: బైరెడ్డిపల్లెలో శుక్రవారం హోలీ వేడుకలను మార్వాడీలు కోలాహలంగా జరుపుకున్నారు. స్థానిక మాతాజీ ఆలయం వద్ద పిల్లలు, పెద్దలు కలసి రంగులు చల్లుకుని సంబరంగా గడిపారు. అనంతరం అందరికీ హోలీ పండుగ శుభాకాంక్షలు తెలిపారు.
- వి.కోట: హోలీ వేడుకలను వి.కోట మండల పరిధిలో మార్వాడీలు అత్యంత వైభవంగా జరుపుకున్నారు. పట్టణంలోని ఆయిమాతా ఆలయం వద్ద గురువారం రాత్రి గుమ్మికూడిన భక్తులు హోలీ కాదేవి బొమ్మను తయారు చేసి సాంప్రదాయం ప్రకారం దగ్ధం చేశారు. శుక్రవారం ఉదయం నుంచి రంగులు చల్లుకుని ఆనందోత్సాహాల నడుమ సంబరాలు జరుపుకున్నారు. ఆలయం వద్ద రామనామ స్మరణతో భక్తులు కోలాటాలు, పండరి భజనలతో సాంప్రదాయ నృత్యాలతో ఉల్లాసంగా గడిపారు. యువకులు, మహిళలు రంగులు చల్లుకున్నారు. కార్యక్రమంలో సిర్వీ సమాజ్ ఆలయ కమిటీ సభ్యులతో పాటు మార్వాడీ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.


పుంగనూరులో గిరిజనుల సంబరాలు


కల్లూరు: హోలీ వేడుకల్లో రాజస్థాన్ వాసులు


వి.కోట: రంగులు చల్లుకొని ఆనందంగా గడుపుతున్న యువతీ యువకులు

రేపు బేలుపల్లెలో ఉచిత వైద్యశిబిరం

బైరెడ్డిపల్లె, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బేలుపల్లె ప్రాథమిక పాఠశాలలో ఈనెల 16న ఉదయం 9 గంటలకు తిరుపతి రమాదేవి మల్టీసూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ సహకారంతో ఉచిత వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు టీడీపీ మండలాధ్యక్షుడు కిశోర్‌గౌడు, నాయకులు పయణి, నాగరాజునాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

18న బైరెడ్డిపల్లెలో కంటి వైద్యశిబిరం

బైరెడ్డిపల్లె, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): బైరెడ్డిపల్లెలోని అగస్త్య పబ్లిక్‌స్కూల్ ఆవరణలో ఈనెల 18న ఉదయం 9 గంటలకు జిల్లా అంధత్వ నివారణ సంస్థ, మొగసాల ట్రస్ట్ ఆధ్వర్యంలో బెంగళూరు శంకర కంటిఆస్పత్రి వైద్యులచే ఉచిత కంటి వైద్యశిబిరాన్ని నిర్వహించనున్నట్లు నిర్వాహకులు ఎంపీపీ రెడ్డెప్ప ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

102 డయల్‌తో పోలీసు రక్షణ

సదుం, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): ప్రమాదకర పరిస్థితిలో అత్యవసర పోలీసు రక్షణ కోసం గతంలో 100కు కాల్ చేయడం మనందరికీ తెలిసిందే. ఇకపై 100 స్థానంలో 112కు అత్యవసర పోలీసు రక్షణ కోసం డయల్ చేయాల్సి ఉంటుందని సదుం ఎస్‌ఐ షేక్ షావలి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం హోలీ పండుగ రోజున ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావివ్వకుండా పోలీసు బందోబస్తు నిర్వహించారు.

అర్ధగిరిలో పౌర్ణమి వేడుకలు

తవణంపల్లె, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రం అర్ధగిరి వీరాంజనేయస్వామి ఆలయంలో శుక్రవారం పౌర్ణమి వేడుకలను నిర్వహించారు. ఆలయ ప్రధానార్చకుడు వేణుగోపాలాచార్యుల ఆధ్వర్యంలో ఉదయం స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, సుదర్శన హోమం నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

పేదల పాలిట పెన్నిధి సీఎం సహాయనిధి: భానుప్రకాష్



బాధితులకు ధ్రువపత్రాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే భానుప్రకాష్

నగరి, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి సహాయనిధి పేదలపాలిట పెన్నిధి అని నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని కొత్తపేటలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో రూ.5,11,657 విలువ చేసే సీఎం సహాయనిధి చెక్కులను బాధిత కుటుంబాలకు ఎమ్మెల్యే పంపిణీ చేశారు. టీడీపీ నాయకులు గుణశేఖర్, జ్యోతినాయుడు, రజనీకుమార్, కార్యకర్తలు పాల్గొన్నారు.

తాగునీటి బోరు ప్రారంభం



గుడిపాల, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): రామభద్రాపురం పంచాయతీ ముట్టుకూరుపల్లె గ్రామంలో నూతన తాగునీటి బోరును తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి గోళ్ల హేమాద్రి నాయుడు శుక్రవారం ప్రారంభించారు. వేసవిలో తాగునీటి సమస్య తలెత్తకుండా ముందుజాగ్రత్తగా బోరు వేయించినట్లు ఆయన తెలిపారు. దీనిపై గ్రామస్థులు హర్షం తెలిపారు.

పారిశుధ్యంపై అవగాహన సదస్సు



ప్రతిభ చూపిన వారికి బహుమతి ప్రదానం చేస్తున్న వైపీ రాజేశ్వరి

గుడిపాల, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): మెరుగైన పారిశుధ్యంతోనే ప్రజలు ఆరోగ్యంగా ఉంటారని ప్రొఫెసర్ బిందు, తెలుగు మహిళ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు వైపీ రాజేశ్వరి అన్నారు. శుక్రవారం 190 రామాపురం సీఎంసీలో చిత్తూరు క్యాంపస్ ఆధ్వర్యంలో పారిశుధ్యంపై అవగాహన సదస్సు నిర్వహించారు. పీఆర్వో ప్రిన్స్, ఉదయ్, జ్యోత్స్న, మరియ, తామరసెల్వి తదితరులు పాల్గొన్నారు.

అర్ధగిరిలో ఘనంగా పౌర్ణమి వేడుకలు



సుదర్శన హోమం నిర్వహిస్తున్న అర్చకులు

తవణంపల్లె, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రం అర్ధగిరి వీరాంజనేయస్వామి ఆలయంలో శుక్రవారం పౌర్ణమి వేడుకలను నిర్వహించారు. ఆలయ ప్రధానార్చకుడు వేణుగోపాలాచార్యుల ఆధ్వర్యంలో ఉదయం స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, సుదర్శన హోమం నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. సాయంత్రం స్వామివారి ఉత్సవ విగ్రహాన్ని ప్రత్యేకంగా అలంకరించి, మేళతాళాల నడుమ ప్రాకారోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

పాఠశాలలో సరస్వతీ పూజ



విజయపురం, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): శ్రీహరిపురం ఉన్నత పాఠశాలలో శుక్రవారం పదో తరగతి విద్యార్థులకు వీడ్కోలు సమావేశంలో భాగంగా సరస్వతీ పూజ నిర్వహించారు. హెచ్ఎం జ్ఞానప్రసాద్, టీచర్లు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణ పునాది ధ్వంసం

● నలుగురిపై కేసు నమోదు



ధ్వంసమైన ఆంజనేయస్వామి ఆలయ పునాది

చిత్తూరు అర్బన్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): ఆలయ నిర్మాణ పునాదిని ధ్వంసం చేసిన నలుగురిపై తాలూకా పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్ఐ మల్లికార్జున తెలిపిన వివరాల మేరకు.. మురకంబట్టులోని అపోలో ఆస్పత్రి ప్రహరీ సమీపంలో శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయం ఉంది. ఈ ఆలయ కమిటీ సభ్యులు ఆలయం పక్కనే ఆంజనేయస్వామి ఆలయాన్ని నిర్మించాలని తీర్మానించారు. 400 చదరపు అడుగుల విస్తీర్ణంలో పునాది వేశారు. శుక్రవారం మురకంబట్టుకు చెందిన చిన్ని, అతని కుమారుడు రాజు, హీరోహోండా షోరూమ్ అధినేత పుండరీకాక్షయ్య, అతని తోడల్లుడు ఆనంద్‌లు కలిసి ఎక్స్‌కవేటర్ తీసుకొచ్చి ఆలయ నిర్మాణానికి వేసిన పునాదిని ధ్వంసం చేశారు. ఈ స్థలం తమదని ఆ నలుగురు అంటుంటే.. కాదు ఆలయానిదేనని ట్రస్టు సభ్యులు చెబుతున్నారు. ఈ సంఘటనపై ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్థులు ఇచ్చిన ఫిర్యాదుతో నలుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

లేఖ రచన పోటీలు



విద్యార్థికి ప్రశంసాపత్రాన్ని అందజేస్తున్న లక్ష్మణ్

చిత్తూరు రూరల్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): తపాలాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి లేఖ రచన పోటీల్లో నగరంలోని ఓ ప్రైవేటు పాఠశాలలో ఆరో తరగతి చదువుతున్న ఎవిన్ ఫ్యాక్టో స్టీఫెన్స్ ప్రతిభ చూపాడు. ఈ సందర్భంగా విద్యార్థికి శుక్రవారం తపాల శాఖ సూపరింటెండెంట్ లక్ష్మణ్.. ప్రశంసాపత్రంతోపాటు రూ.6వేల నగదు బహుమతి ప్రదానం చేశారు. విద్యార్థి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఘనంగా జనసేన ఆవిర్భావ దినోత్సవం



పేదలకు అన్నదానం చేస్తున్న జనసేన నేతలు

బంగారుపాళ్యం, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): జనసేన ఆవిర్భావ దినోత్సవాన్ని మండల కేంద్రంలో జనసైనికులు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. పార్టీ కార్యాలయం వద్ద జనసేన జెండాను ఆవిష్కరించి, కేక్ కట్ చేశారు. గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాల విద్యార్థులకు విద్యాసామగ్రి వితరణ చేశారు. పేదలకు అన్నదానం చేశారు. నాయకులు బాలసుబ్రహ్మణ్యం, పవన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

గుడిపాల: మండలంలోని కుప్పిగానిపల్లెలోనూ జనసేన ఆవిర్భావ దినోత్సవాన్ని నిర్వహించారు. సిద్ధురాయల్ ఆధ్వర్యంలో గ్రామస్థులు కేకు కట్ చేసి, బాణసంచా కాల్చారు.

రెండు ద్విచక్ర వాహనాల ఢీ

తమిళనాడువాసి దుర్మరణం

పాలసముద్రం, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్న ప్రమాదంలో తమిళనాడు వాసి దుర్మరణం చెందాడు. ఎస్ఐ చిన్నరెడ్డెప్ప తెలిపిన వివరాల మేరకు.. తమిళనాడులోని ఈడిగపేటకు చెందిన మణి(54) సొంత పనిపై బలిజకండ్రిగకు శుక్రవారం వచ్చాడు. తిరిగి స్వగ్రామానికి బయల్దేరాడు. అదేసమయంలో పాలసముద్రం కాలనీకి చెందిన విజయ్‌కుమార్ మరో ద్విచక్రవాహనం వస్తున్నాడు. ఇద్దరూ పాలసముద్రం మండలంలోని సీఎం కండ్రిగ వద్దకొచ్చేసరికి ఎదురెదురుగా ఢీకొన్నారు. ఇద్దరూ హెల్మెట్ ధరించక పోవడంతో మణి సంఘటన స్థలంలోనే మృతి చెందాడు. విజయ్‌కుమార్‌కు తీవ్రగాయాలయ్యాయి. బాధితుడిని, మృతదేహాన్ని చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

మట్టి రోడ్లు, దుర్గంధం

నగరంలోని శివారు ప్రాంత కాలనీల్లో ఇదీ పరిస్థితి

చిత్తూరు అర్బన్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): ప్రశాంత్‌నగర్ సమీపంలోని వైఎస్ కాలనీ, ఇందిరమ్మకాలనీలో మౌలిక సదుపాయాల్లేక



మంగసముద్రం హౌసింగ్‌కాలనీలో ఇళ్ల మధ్య మురుగు

ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. వందల సంఖ్యలో గృహాలు ఉన్నప్పటికీ నగరానికి శివారు ప్రాంతం కావడంతో నగరపాలక అధికారులు పట్టించుకోలేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎగుడు దిగుడుగా ఉన్న మట్టిరోడ్లపైనే రాకపోకలు సాగిస్తున్నారు. వీధి దీపాలు సరిగా వెలగడం లేదు. ఏపుగా పెరిగిన పిచ్చిమొక్కల నుంచి విషపురుగులు రాత్రి వేళల్లో ఇళ్లలోకి వస్తున్నాయి. సైడు కాలువలు కూడా లేకపోవడంతో ఇళ్ల పక్కనే గుంతలను తవ్వుకుని అందులోకి మురుగు వదులుకుంటున్నారు. దీనివల్ల దోమలు పెరిగిపోతున్నాయి. దుర్గంధం వెదజల్లుతోంది. అలాగే 47వ డివిజన్ పరిధిలోని మంగసముద్రం హౌసింగ్‌కాలనీ, లెనిన్‌నగర్ కాలనీ, పట్రాంపల్లెలోనూ కాలువలు, రహదారుల లేక పారిశుధ్య లోపంతో స్థానికులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు.



వైఎస్ కాలనీలో సైడు కాలువల్లేని మట్టిరోడ్డుపై నిలిచిన మురుగు

అర్ధరాత్రి దొంగల హల్‌చల్

ఇళ్ల తాళాలు పగులగొట్టి 20 గ్రాముల బంగారం, 180 గ్రాముల వెండి, నగదు అపహరణ

బంగారుపాళ్యం, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): అర్ధరాత్రి దొంగలు హల్‌చల్ చేశారు. ఇళ్ల తాళాలు పగులగొట్టి బంగారం, వెండి, నగదు అపహరించుకెళ్లారు. సీఐ కత్తి శ్రీనివాసులు తెలిపిన వివరాల మేరకు.. పాలేరు పంచాయతీ శేషాపురంపై గురువారం అర్ధరాత్రి దొంగలు పడ్డారు. గ్రామానికి చెందిన సుబ్రహ్మణ్యం కుమార్తె సుజాత తిరువణ్ణామలైకు వెళ్లగా, ఆమె ఇంటి తాళాలు పగలగొట్టి రెండు జతల కమ్మలు, నల్లపూసల దండ కలిపి 20 గ్రాముల బంగారంతోపాటు 180 గ్రాముల వెండి దీపాలను ఎత్తుకెళ్లారు. ఇదే గ్రామానికి చెందిన రమేష్, సుశీలమ్మ ఇళ్లలోనూ ఇలాగే చొరబడి స్వల్ప మొత్తంలో నగదు చోరీ చేశారు. శుక్రవారం ఉదయం పోలీసులకు గ్రామస్థులు సమాచారం ఇచ్చారు. సీఐ తన సిబ్బంది, చిత్తూరు క్లూస్ టీంతో సంఘటన స్థలానికి చేరుకుని వేలిముద్రలను సేకరించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.



చోరీ జరిగిన ఇంట్లో పోలీసుల పరిశీలన

హోలీ సందడి



చిత్తూరులో, నెత్తంకండ్రిగ వద్ద రంగులు చల్లుకున్న యువత

చిత్తూరు కల్చరల్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): నగరంలో హోలీని శుక్రవారం మార్వాడీలు ఘనంగా జరుపుకున్నారు. వేకువ జామున బజారు వీధిలో నృత్యాలు చేస్తూ ఉత్సాహంగా గడిపారు. ముత్తిరేవుల పొన్నతోటలో రంగులు చల్లుకుని చిన్నాపెద్దా సందడిగా గడిపారు.

నగరి: నెత్తంకండ్రిగ వద్ద ఉన్న శ్రీనివాస కల్యాణ మండపంలో మార్వాడీలు హోలీ పండుగను జరుపుకున్నారు. రంగులు చల్లుకుంటూ, డ్యాన్సులు చేశారు

ఘనంగా 'పై' డే



వెదురుకుప్పం, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ 'పై' డేని కార్వేటినగరం మండలం డీఎం పురం జడ్పీ ఉన్నత పాఠశాలలో శుక్రవారం ఘనంగా జరుపుకున్నారు. గణితశాస్త్ర ఉపాధ్యాయుడు రంజిత్‌కుమార్ 'పై' స్థిరాంకం గురించి వివరించారు. ఈ సందర్భంగా వ్యాయామ సంచాలకుడు తిరుమలరాజు కుమారుడు రూపేష్.. పదో తరగతి విద్యార్థులకు భోజనం, స్వీట్లు పంపిణీ చేశారు. 15వ దశాంశ స్థానాల వరకు 'పై' విలువను విద్యార్థులు ప్రదర్శించారు. పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మన్ త్యాగరాజు పాల్గొన్నారు.

ముగిసిన లక్ష్మీనరసింహుడి బ్రహ్మోత్సవాలు



చక్రస్నానంలో పాల్గొన్న భక్తులు

శ్రీరంగరాజపురం, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): మంగుంటలోని లక్ష్మీ నరసింహస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు శుక్రవారం చక్రస్నానంతో ముగిశాయి. ఉదయం స్వామివారికి అభిషేకం, కల్యాణోత్సవం, తదితర పూజలు చేశారు. అనంతరం అశ్వ వాహనంపై ఊరేగించారు. భక్తులకు అన్నదానం చేశారు. ఆలయ అర్చకుడు వెంకటాచలపతి, ఎగువ మంగుంట, దిగువ మంగుంట గ్రామస్థులు పాల్గొన్నారు.

గొల్లగంగమ్మ ఆలయ కుంభాభిషేకం



కుంభాభిషేకంలో పాల్గొన్న కర్ణాటక మాజీ మంత్రి సుబ్రహ్మణ్యం నాయుడు

పాలసముద్రం, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): ఆముదాల గ్రామంలో నూతనంగా నిర్మించిన గొల్లగంగమ్మ ఆలయ కుంభాభిషేకాన్ని శుక్రవారం వైభవంగా నిర్వహించారు. యాగశాలలో పూజలు చేశాక కలశాలను తీసుకొచ్చి ఆలయ శిఖరంపై ప్రతిష్ఠించారు. ఆలయ ప్రాంగణంలో భక్తులకు అన్నదానం చేశారు. కర్ణాటక మాజీమంత్రి కట్టా సుబ్రహ్మణ్యం నాయుడు, టీడీపీ కార్యనిర్వాహక రాష్ట్ర కార్యదర్శి భీమినేని చిట్టిబాబునాయుడు, టీడీపీ నాయకులు తాళ్లూరి శివ, సుధాకర్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

కల్లూరు అడవికి ఆకతాయిల నిప్పు

కల్లూరు, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): పులిచెర్ల మండలం కల్లూరు నుంచి దామలచెరువుకు వెళ్లే జాతీయ రహదారికి ఇరువైపులా ఉన్న అడవికి శుక్రవారం కొందరు ఆకతాయిలు నిప్పు పెట్టారు. దీంతో శుక్రవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు అడవిలో మంటలు చెలరేగుతూనే ఉన్నాయి.

రైతులకిచ్చిన హామీ నిలబెట్టుకోవాలి

● కేంద్ర మాజీ మంత్రి చింతామోహన్



నగరిలో కాంగ్రెస్ నేతలతో కలిసి నినాదాలు చేస్తున్న చింతామోహన్

నగరి, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): రైతులకు ఇచ్చిన హామీని రాష్ట్ర ప్రభుత్వం నిలబెట్టుకోవాలని కేంద్రమాజీ మంత్రి చింతామోహన్ డిమాండ్ చేశారు. ఈ మేరకు నగరి ఎంపీడీవో కార్యాలయం వద్ద రైతు సమస్యలపై కాంగ్రెస్ శ్రేణులతో కలిసి శుక్రవారం ధర్నా చేశారు. ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో ప్రతి రైతుకూ రూ.20వేలను ఏడాదికోసారి ఇస్తామని చెప్పి అధికారంలోకి వచ్చి ఇన్ని నెలలైనా పట్టించుకోక పోవడం సరికాదన్నారు. అలాగే నిరుద్యోగ భృతిని అమలు చేయలేదని విమర్శించారు. విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు అందడం లేదన్నారు. పవర్‌లూమ్ కార్మికులు ఇస్తానన్న 500 యూనిట్ల ఉచిత కరెంటు మాటేమిటని ప్రశ్నించారు. నాయకులు బాబు, చిరంజీవిరెడ్డి, కుమార్, గుణ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత శిఖరాలు అధిరోహించాలి



టీచర్లతో పదో తరగతి విద్యార్థులు

బంగారుపాళ్యం, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు బాగా చదువుకుని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఎగువరాగిమానుపెంట జడ్పీ ఉన్నత పాఠశాల హెచ్ఎం సుజాత ఆకాంక్షించారు. శుక్రవారం పాఠశాల ఆవరణలో పాఠశాల వార్షికోత్సవం, టెన్త్ విద్యార్థుల వీడ్కోలు కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన నృత్యం, అయోమయం డాక్టర్ నాటకం అలరించాయి. ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి



క్రీడల్లో ప్రతిభ చూపిన విద్యార్థులతో ప్రిన్సిపాల్ నవీన్

పూతలపట్టు, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలని వేము ఇంజనీరింగ్ కళాశాల చైర్మన్ డాక్టర్ కె.చంద్రశేఖర్ నాయుడు కోరారు. పి.కొత్తకోట సమీపాన ఉన్న కళాశాలలో ప్రజ్ఞా 2కే25 కార్యక్రమం రెండో రోజైన శుక్రవారం కూడా కొనసాగింది. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ.. క్రీడలు మానసికోల్లాసం, శారీర దృఢత్వానికి ఎంతగానో తోడ్పడతాయన్నారు. అనంతరం కళాశాల ఆవరణంలో నిర్వహించిన క్రీడల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో మ్యానుఫ్యాక్చరింగ్ ఇండోనేషనల్ లిమిటెడ్ ప్లాంట్ హెడ్ నాగరాజు, ప్రిన్సిపాల్ నవీన్ కిలారి, కన్వీనర్లు డాక్టర్ కె.మునీంద్ర, కో-కన్వీనర్ డాక్టర్ జి.ఇళయరాజా పాల్గొన్నారు.

మతిస్థిమితం లేని యువకుడి ఆత్మహత్య

పుంగనూరు రూరల్, మార్చి 14 (ఆంధ్రజోతి): మతిస్థిమితం లేని ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన శుక్రవారం పుంగనూరు పట్టణంలో జరిగింది. భగత్‌సింగ్ కాలనీకి చెందిన అబ్దుల్ సాహెబ్ కుమారుడు సయ్యద్(24) మతిస్థిమితం లేక ఇంట్లో ఉరేసుకోగా కుటుంబీకులు గుర్తించారు. వెంటనే ప్రభుత్వాస్పత్రికి తలించగా అప్పటికే మృతి చెందినట్లు డాక్టర్లు నిర్ధారించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పంటలపై ఒంటరి ఏనుగు దాడి



అడవిచేనులో ఏనుగు పాదముద్రలు

గుడిపాల, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): మండలం నుంచి తమిళనాడుకు వెళ్లిన ఒంటరి ఏనుగు తిరిగొచ్చి పంటలపై దాడి చేసింది. దీంతో రైతులు భయాందోళన వ్యక్తం చేశారు. అడవిచేనుకు చెందిన రైతులు హరి, శివలకు చెందిన వరి, రైతు సురేష్‌కు చెందిన మిరప, పిల్లారికుప్పం గ్రామానికి చెందిన బాలకృష్ణారెడ్డి, సాంబశివరెడ్డిల అరటి, కొబ్బరి చెట్లను ధ్వంసం చేసింది. ప్రభుత్వం ఆర్థికసాయం అందజేసి ఆదుకోవాలని కోరుతున్నారు.

రాత్రివేళల్లో పొలాల్లోకి వెళ్లొద్దు

రైతులకు పంట నష్టపరిహారం చెల్లించేలా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ ఆనంద్ రెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన నష్టపోయిన రైతుల వివరాలు సేకరించారు. రాత్రివేళల్లో పొలాల వద్దకు రైతులు వెళ్లొద్దని హెచ్చరించారు. ఒంటరి ఏనుగును తమిళనాడు అటవీ ప్రాంతంవైపు మళ్లించడానికి చర్యలు చేపడుతున్నామని చెప్పారు.



పిల్లారికుప్పంలో ధ్వంసమైన వరి

సంక్షిప్తంగా..

నేడు ప్రజాదర్బార్

పెనుమూరు, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): పెనుమూరు ఎంపీడీవో కార్యాలయంలో శనివారం ప్రజాదర్బార్ నిర్వహించనున్నట్లు ఎంపీడీవో నీలకంఠేశ్వరరెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. ఈకార్యక్రమంలో ఎమ్మెల్యే థామస్ పాల్గొంటారని పేర్కొన్నారు. అన్నిశాఖల అధికారులు హాజరు కావాలన్నారు. ప్రజలు తమ సమస్యలను తెలియజేవయచ్చని

నేటినుంచి కుంభాభిషేక పూజలు

చిత్తూరు కల్చరల్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): పొన్నియమ్మ ఆలయ మహా కుంభాభిషేక పూజా కార్యక్రమాలు శనివారం నుంచి సోమవారం వరకు నిర్వహించనున్నట్లు ట్రస్టీ, చిత్తూరు మాజీ ఎమ్మెల్యే సీకే బాబు తెలిపారు. భక్తులు సంప్రదాయ దుస్తుల్లోనే పాల్గొనాలని కోరారు.

షార్ట్ సర్క్యూట్‌తో చెరకు తోట దగ్ధం



తవణంపల్లె, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ షార్టు సర్క్యూట్ జరిగి నిప్పురవ్వలు పడటంతో చెరకు తోట దగ్ధమైంది. ఎగువతడకరకు చెందిన ప్రకాష్ చెరకు తోట పక్కన ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌లో షార్టు సర్క్యూట్‌తో నిప్పురవ్వలు చెలరేగాయి. అవి తోటపై పడటంతో మంటలు చెలరేగి, రెండు లక్షల విలువైన ఎకరం తోట పూర్తిగా కాలి బూడిదైంది. తనకు ప్రభుత్వం ఆదుకోవాలని బాధితుడు కోరుతున్నాడు.

రామకృష్ణ ఆశ్రమానికి విరాళం

చిత్తూరు రూరల్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): నగరంలోని అగస్త్యేశ్వరస్వామి ఆలయం వద్ద ఉన్న శ్రీరామకృష్ణ ఆశ్రమంలో నిత్యపూజా కైంకర్యాలకు పార్థసారథినాయుడు రూ.10వేలను విరాళంగా ఇచ్చారు. శుక్రవారం ఈ మొత్తాన్ని నిర్వాహకులు ప్రకాష్‌రెడ్డి, శరత్‌చంద్రలకు అందజేశారు.

ప్రేమ పేరుతో మోసం

విజయపురం, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): ప్రేమ పేరుతోనమ్మించి మోసం చేశారంటూ ఓ యువతి శుక్రవారం విజయపురం పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు. ఎస్ఐ బలరాం తెలిపిన వివరాల మేరకు.. తిరుపతిలో నర్సుగా పనిచేస్తున్న యువతితో కళియంబాకం దళితవాడకు చెందిన జ్యోతిబసు(28) పెళ్లి చేసుకుంటానని నమ్మబలికి నాలుగేళ్లపాటు ప్రేమాయణం సాగించాడు. చివరకు చెప్పా పెట్టకుండా ఉద్యోగరీత్యా ఒడిశాకు వెళ్లిపోయాడని యువతి ఫిర్యాదు చేసిందని ఎస్ఐ తెలిపారు.

నగదు విషయమై ఘర్షణ

ఒకరిపై అట్రాసిటీ కేసు నమోదు

గుడిపాల, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): నగదు విషయమై జరిగిన ఘర్షణలో ఒకరిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదైంది. ఎస్ఐ రామ్మోహన్ శుక్రవారం మీడియాకు వివరాలు తెలిపారు. నారగల్లు పంచాయతీ కొత్తకోట కాలనీకి జగదీష్‌కు, గుడిపాల జనసేన అధ్యక్షుడు రూప్‌కుమార్‌కు మధ్య నగదు విషయంలో మాటామాటా పెరిగి ఘర్షణకు దారితీసింది. ఈ క్రమంలో తమను దూషించి, దాడి చేశాడని రూప్‌కుమార్‌పై జగదీష్ భార్య సంధ్య పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

అలరించిన బాబా సంకీర్తనలు

చిత్తూరు కల్చరల్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): తపోవనం రాస్ వృద్ధాశ్రమంలో సత్యసాయి భజనమండలి ఆధ్వర్యంలో గానం చేసిన బాబా సంకీర్తనలు అలరించాయి. దాదాపు రెండు గంటలపాటు జరిగిన ఈ కార్యక్రమంలో సత్యసాయి సేవాసమితి జిల్లా అధ్యక్షుడు ఎస్.మధుసూదనం, నగర కన్వీనర్ ప్రభాకర్ నాయుడు, పాండురంగం, తదితరులు పాల్గొన్నారు.